# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సంపుటి : 2 | సంచిక : 269 | శుక్రవారం | 21 - 02 - 2025 | పేజీలు : 8 | వెల : 5.00 | www.telanganamuchatlu.in

## అగ్రరాజ్యానికి కేసీఆర్..?




హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు

బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా అడుగులు వేయకుంటే పార్టీ మటాష్ అవుతుందని భావించారట పెద్దాయన. ఆ విధంగా అడుగులు వేసినట్టు కనిపిస్తోంది. బీసీల అంశం పార్టీలో ఏ మాత్రం ప్రస్తావనకు రాకుండా జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో పాత అంశాలను ప్రస్తావించినట్టు కొందరు నేతలు చెబుతున్నారు. పార్టీలో ఇప్పటివరకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఒక్కరే ఉన్నారు. ఆ సంఖ్యను నాలుగుకు చేర్చాలని నిర్ణయం తీసుకున్నారట పార్టీ అధినేత. ఇప్పటివరకు కేటీఆర్ ఒక్కటే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండేవారు. కేటీఆర్‌తోపాటు మరో ముగ్గురికి అవకాశం కల్పించనున్నా రట. వారిలో మహిళలకు ఎక్కువగా ఛాన్స్ ఉందని పార్టీ వర్గాల మాట. ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ, ఇంకొకరు టాప్ కమ్యూనిటీకి చెందిన మహిళ ఉండనున్నట్లు.. ■ మిగతా 3లో..

## మూడు స్థానాల్లో బీజేపీదే గెలుపు

☐ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలను బిజెపి పార్టీ అభ్యర్థులు గెలుస్తారిని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పైన అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ ,బిఆర్ఎస్ పార్టీలకు ఎమ్మెల్సీగా పోటీ చేస్తే ధైర్యం లేదు. అందుకే తెర వెనుక నాటకాలు ఆడుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం ఉన్నప్పుడు మూడు డీఏలను పెండింగ్ పెట్టింది...కాంగ్రెస్ ప్రభుత్వం రెండు డీఏలను పెండింగ్ పెట్టింది. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ఎన్నికల్లో నిరుద్యోగ భృతి ఇస్తా అని హామీ ని అమలు చేయడం లేదు. రాహుల్ గాంధీ ,రేవంత్ రెడ్డి డిమాండ్ చేస్తున్న సంవత్సరం పూర్తి రెండు లక్షల ఉద్యోగులు భర్తీ చేసే ఉంటే అశోక్ నగర్ లైబ్రరీ రావాలి. సకాలంలో ఫీజు రియంబర్స్మెంట్ చేయకపోవడంతో పేద విద్యార్థుల బాధ పడుతున్నారు. పేద విద్యార్థులకు ఇస్తాను అన్న విద్య భరోసా కార్డు ఇవ్వలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం 317 జీవో తెచ్చి ఉద్యోగస్తులను ఇబ్బంది పెట్టింది.రేవంత్ రెడ్డి సర్కార్ ఇచ్చిన ఏ ఒక హామీ కూడా అమలు చేయడం లేదు. మార్పు పేరుతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..ప్రజలకు ఎలాంటి మార్పు రాలేదు.బి ఆర్ ఎస్ పార్టీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ వచ్చింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే దోపిడీ చూశాం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దోపిడీ చూస్తున్నాం.. కనీసం పార్టీకి కానీ పదవికి రాజీనామా చేయకుండా ఎంపీ పోటీ చేసే దౌర్భాగ్యం పరిస్థితి తెలంగాణలో ఉందని ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఉద్దేశిస్తూ అన్నారు.

## కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు..!



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :

హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం ఉందని పేర్కొంటూ లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. లోక్‌పాల్ ఇచ్చిన ఆదేశాలపై ఈ సందర్భంగా సుప్రీంకోర్టు అసంతృప్తిని, ఆందోళనను వ్యక్తం చేసింది. ఇది చాలా ఆందోళనకరమైన విషయమని పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యంపై కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో లోక్‌పాల్ రిజిస్ట్రార్, హైకోర్టు న్యాయమూర్తిపై ఫిర్యాదు చేసిన వ్యక్తికి సైతం నోటీసులు ఇచ్చింది. వాస్తవానికి, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై వచ్చిన ఫిర్యాదును లోక్‌పాల్ విచారించింది.లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను విచారించే అధికారం ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. లోక్‌పాల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చిన కోర్టు.. సదరు హైకోర్టు న్యాయమూర్తి పేరును బహిర్గతం చేయొద్దని, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అభయ్ ఓకా ధర్మాసనం ఆదేశించింది. న్యాయమూర్తి పేరును గోప్యంగా ఉంచాలని ఫిర్యాదుదారుడికి స్పష్టం చేసింది. కేసు విచారణను మార్చి 18 వరకు వాయిదా వేసింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణకు హాజరయ్యారు. హైకోర్టు న్యాయమూర్తులు లోక్‌పాల్, లోకాయుక్త చట్టం 2013 పరిధిలోకి ఎప్పటికీ రారని స్పష్టం చేశారు.జనవరి 27న, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నేతృత్వంలోని లోక్‌పాల్ తన ఉత్తర్వులో లోక్‌పాల్ చట్టం ప్రకారం.. హైకోర్టు న్యాయమూర్తులు కూడా లోక్‌పాల్ పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. ఓ ఫిర్యాదుపై విచారణ సందర్భంగా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఒక ప్రైవేట్ కంపెనీకి సంబంధించిన కేసులో సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తి అదనపు జిల్లా న్యాయమూర్తి, మరొక హైకోర్టు న్యాయమూర్తిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. లోక్‌పాల్ ఆదేశాలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ జరుపుతున్నది. లోక్‌పాల్ వివరణ సైతం కోరింది.



### రాజలింగమూర్తి హత్యపై
## మంత్రి షాకింగ్ కామెంట్స్

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :

సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాజ లింగ ముర్తి హత్యపై సీబీసీఐడీతో విచారిసామని స్పష్టం చేశారు. ఈ హత్యపై పోలీసుల విచారణ జరుగుతోందని.. దోషులను 24 గంటల్లోనే పట్టుకుంటామని తెలిపారు. రాజలింగ మూర్తి కేసును ఫాస్ట్రాక్ కోర్టులో విచారణ జరిపిస్తామని చెప్పారు. రాజలింగముర్తిని గండ్ర వెంకట రమణా రెడ్డి హత్య చేయించారన్నారు. దీని వెనక కేసీఆర్, కేటీఆర్, హరీష్ ఉన్నారని ఆరోపించారు. "మీరు తెలంగాణలో ఎలా పుట్టారో అర్థం కావడం లేదు. బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోంది. హత్యా రాజకీయాలు తెలంగాణ సంస్కృతి కాదు. బీఆర్ఎస్ నేతలు హత్యా రాజకీయాలను మానుకోండి. దోపిడీని ప్రశ్నిస్తే హత్య చేసే స్థాయికి దిగజారారు. సామాజిక కార్యకర్త రాజలింగముర్తి హత్యను ఖండిస్తున్నాను" అని అన్నారు. మేడిగడ్డ అక్రమాలపై రాజలింగమూర్తి కోర్టులో పోరాడుతున్నాడని తెలిపారు. పదిమంది చిల్లర గాళ్లను రోడ్లపైకి వదిలారంటూ మండి పడ్డారు. నీళ్లు పోసుకుని పెట్రోల్ అని చెప్పి అమాయకులు చనిపోవడానికి హరీష్ కారణం అయ్యారని దుయ్యబట్టారు.


## బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు



హైదరాబాద్ , తెలంగాణ ముచ్చట్లు :

హత్యా రాజకీయాలు కాంగ్రెస్ పార్టీకే అలవాటు.. బీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు అని మాజీ ఎమ్మెల్యే గండ్రా వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గండ్రా వెంకటరమణారెడ్డి మీడియాతో మాట్లాడారు. భూపాలపల్లిలో రాజలింగ మూర్తి హత్యను బీఆర్ఎస్ మాజీ శాసన సభ్యుడిగా తీవ్రంగా ఖండిస్తున్నాం. హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతోంది. ఈ హత్యను బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్, హరీశ్‌రావుకు ఆపాదించాలని కాంగ్రెస్ శతవిధాల ప్రయత్నించడం దుర్మార్గం. స్థానిక భూవివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగిందని ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. కొందరి ఒత్తిడితో రాజలింగ మూర్తి భార్య నాపై ఆరోపణలు చేస్తున్నారు అని వెంకట రమణారెడ్డి తెలిపారు.ఈ హత్యపై సీబీఐ, సీఐడీ విచారణను కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. ఎలాంటి విచారణ చేసుకున్నా మాకు అభ్యంతరం లేదు. మేడిగడ్డపై రాజలింగమూర్తి కోర్టులో కేసు వేశారు. దాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటున్నాం.. ■ మిగతా 3లో..

## కాళేశ్వరం కమిషన్ గడువు మరో 2 నెలలు పెంపు



హైదరాబాద్ , తెలంగాణ ముచ్చట్లు :

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జరుగుతున్న విచారణ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును మరో 2 నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పొడిగింపు ఫైలుపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేశారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు కమిషన్ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు, మాజీ ఈఎన్‌సీలతో పాటు చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన కమిషన్.. ఇక నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా, ఇతర హోదాల్లో పనిచేసిన ప్రస్తుత, మాజీ ఐఏఎస్‌లను విచారించి బ్యారేజీల నిర్మాణంలో కీలక నిర్ణయాలు ఎవరు తీసుకున్నారన్న అంశంపై సాక్ష్యాలను సేకరించేందుకు సన్నద్ధమైంది.

## రాకేష్‌కు సీఎం రేవంత్ చేయూత



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :

కండరాల వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకో లేకపోతున్న నిరు పేద యువకుడు రాకేష్ గురించి తెలుసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చలించిపోయారు. తక్షణమే రాకేష్‌కు కావాల్సిన వైద్య సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉచితంగా వైద్యం అందిం చడంతో పాటు రాకేష్ కోసం ఛార్జింగ్ వాహనాన్ని కూడా అందిం చాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు రాకేష్ కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ఆదుకుంటామని సీఎం తరఫున హామీ ఇచ్చారు. హను మకొండ జిల్లా భీమదేవరపల్లి ■ మిగతా 3లో..

## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కృషి



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :

తెలంగాణ రాష్ట్రంలో అన్నిరంగాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం నిధులు ఇస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. రైతులను అన్నివిధాలా కేంద్రం ఆదుకుంటుందని అన్నారు. ఆరు గ్యారెంటీలను తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిం చారు. ఆరు గ్యారెంటీ స్కీంల్లో ఎన్ని అమలు చేస్తున్నారో దమ్ము ఉంటే చర్చకు సిద్ధమా అని బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. (గురువారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సిద్ధమా అని ఛాలెంజ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి పోయి మాట్లాడుతున్నారని ధ్వజ మెత్తారు. రేవంత్ చిల్లర మాటలు ఇక ఆపు అని హెచ్చరించారు. రేవంత్ మాటాలను ప్రజలు మెచ్చడం లేదని అన్నారు. రేవంత్ తన వైఖరి మార్చుకోవాలని బండి సంజయ్ సూచించారు.యాదాద్రి: రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. ఇవాళ(గురువారం) యాదాద్రిలో కిషన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అన్నివర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు నాటకాలాడుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 స్థానాల్లోనూ బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివర్గాల్లోనూ వ్యతిరేకత ఉందని కిషన్‌రెడ్డి విమర్శించారు.



## తెలంగాణలో రంజాన్ రచ్చ..?

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :

తెలంగాణ రాజకీయాల్లో పూర్తిస్థాయిలో మార్పులు కనిపిస్తున్నాయి. మతం హైలెట్ అవుతోంది. అదే పనిగా కుల, మతాలను వాడేసుకుంటున్నారు మూడు పార్టీల నేతలు. తాజాగా రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు గంటపాటు వెసులుబాటు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై బీజేపీ రచ్చ ప్రారంభించింది. నిన్నటి వరకు బీసీ కుల గణనలో ముస్లిం బీసీలు అని పేర్కొడంపై బీజేపీ నేతలు మండిపడ్డారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అయితే బీసీ ముస్లింలు ఏంటి అని, తొలగించాలని డిమాండ్ చేశారు. దానిని తొలగిస్తే బీసీ రిజర్వేషన్ల పెంపు విషయం ఆలోచిస్తామని తెలిపారు. ఇక తాజాగా రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటుపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అవకాశం హిందువులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తోంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ■ మిగతా 3లో..

# ఈ హత్యపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్..!

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణలో దారుణం జరిగింది. జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నాగవల్లి సరళ భర్త రాజ లింగమూర్తిని కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేసి చంపేశారు గుర్తు తెలియని వ్యక్తులు. ఆసుపత్రికి తీసుకెళ్లే లోపు ఆయన మృతి చెందాడు. మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు పలువురిపై భూపాలపల్లి కోర్టులో పిటిషన్ వేసిన వ్యక్తి రాజలింగమూర్తి. దీంతో మూర్తి హత్య వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. బీఆర్ఎస్ పెద్దలే రాజలింగమూర్తిని హత్య చేయించారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. అసలు నిజం ఏమిటన్నది విచారణలోనే తేలనుందిమేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని కేసు వేసిన భూపాలపల్లికి చెందిన 47 ఏళ్ల రాజలింగమూర్తి. కోర్టు అప్పట్లో కేసీఆర్, హరీష్‌రావుకు నోటీసులు జారీ చేసింది. దీంతో లింగమూర్తి పేరు తెలుగులోకి వచ్చింది .బుధవారం రాత్రి రాజలింగమూర్తి దారుణహత్యకు గురయ్యాడు. ఆయనను హత్య చేయడానికి కారణమేంటి? రాజకీయ కక్షలే కారణమా? ఏమైనా భూతగాదాలు ఉన్నాయా? ఇవే ప్రశ్నలు చాలామందిని వెంటాడుతున్నాయి. ఈ వ్యవహారంపై రకరకాల వార్తలు వెలుగులోకి వస్తున్నాయి.బుధవారం రాత్రి దాదాపు ఏడున్నర గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రాజలింగమూర్తిపై దాడి చేశారు. తమతో తెచ్చుకున్న కత్తులు, గొడ్డళ్లతో ఆయన్ని అత్యంత దారుణంగా నరికి చంపారు. ఈయనపై గతంలో భూతగాదాల కేసులు నమోదయ్యాయి. హత్యకు సంబంధించి రకరకాల కారణాలు బయటకు వస్తున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.రాజలింగమూర్తి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ భర్త. 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భూపాలపల్లిలోని 15వ వార్డు నుంచి ఆమె బీఆర్ఎస్ తరపున కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఏం జరిగిందో తెలీదుగానీ కొద్దినెలల తర్వాత నాగవెల్లి సరళను కారు పార్టీ బహిష్కరించారు.బాధితుడి కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాజలింగమూర్తి తన స్వగ్రామం జంగేడులో సోదరుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. టూ వీలర్స్‌పై భూపాలపల్లికి తిరిగి వస్తున్నాడు. అయతే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం





ఎదురుగా రోడ్డును దాటుతున్న సమయంలో దాదాపు ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు క్యాంపులు ధరించి ఆయన్ని చుట్టుముట్టారు. పలు ప్రశ్నలు లేవనెత్తారని తెలుస్తోంది. ఈ క్రమంలో వాళ్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పట్టరాని కోపంతో తమతో తెచ్చుకున్న కత్తులు, గొడ్డళ్లతో రాజలింగ మూర్తిని నరికి చంపేశారు దుండగులు. రక్తపు మడుగులో ఆయన పడిపోయాడు. బలమైన కత్తిపోట్ల కారణంగా పేగులు బయటకు వచ్చాయి. తలకు బలమైన గాయం అయ్యింది. హత్య విషయం తెలియగానే స్థానికులు ఆయన్ని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. రాజలింగ మూర్తి హత్యపై ఆయన కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక మాజీ ఎమ్మెల్యే , మాజీ సర్పంచి , వార్డు మాజీ కౌన్సిలర్ కారణమని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని రాజలి ంగ మూర్తి భార్య సరళ, కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో రాత్రి బైఠాయించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. రాజలింగమూర్తి హత్యకు భూ తగాదాలే కారణమనే వాదన సైతం లేకపోలేదు. రెండు దశాబ్దాలుగా వరంగల్‌కు చెందిన ఓ న్యాయవాది ద్వారా భూ సమస్యలను పరిష్కరించేవాడు రాజలింగమూర్తి. గతంలో ఆయనపై పలు కేసులు కూడా నమోద య్యాయి. ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకాలతో పర్యావరణం దెబ్బతింటోందని సింగరేణిపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేసిన వ్యక్తి రాజ లింగ మూర్తి.విచారణకు ఆదేశించిన సీఎం రాజ లింగమూర్తి హత్య కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఇంతకీ ఆయనను చంపిందెరు? పగబట్టి చంపారా, రాజకీయ హత్యా? అధికార పార్టీ ముమ్మాటికీ రాజకీయ హత్యేనని చెబుతోంది. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఈ కేసు సీఐడీకి ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది రాజ లింగమూర్తి హత్య కేసు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుపై కేసు వేసిన వ్యక్తి ఆయన. బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. దీన్ని తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రాజకీయ ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ కేసు విచారణను సీఐడీకి అప్పగించాలని నిర్ణయించింది.కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు రాజలింగమూర్తి. దీంతో భూపాల్‌పల్లి న్యాయస్థానంలో కేసు వేశారు. న్యాయస్థానం మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురికి నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ కేసుపై న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది.అంతలోనే రాజలింగ మూర్తి బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. ముసుగులో వచ్చిన కొందరు ఆయనపై కత్తులు, గొడళ్లతో దాడి చంపేశారు. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది.ఈ ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రియాక్ట్ అయ్యారు. రాజలింగమూర్తి హత్యను ఖండించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దోపిడి,అవినీతిపై ప్రశ్నించి కేసులు వేసినందుకే లింగమూర్తిని హత్య చేశారని వ్యాఖ్యానించారు. కొన్ని నెలల కిందట ఇదే కేసు నడుస్తుండగా సంజీవరెడ్డి అనే న్యాయవాది కూడా అనుమానస్పదంగా చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు సదరు మంత్రి.ఈ హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు భూపాలపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు. దీని వెనుక ఎవరున్నారో, హత్య ఎందుకు చేశారో నిజాలు అన్నీ బయట పడతాయన్నారు. భూపాలపల్లిలో హత్యా రాజకీయాలకు ఎలాంటి తావు ఉండకూడదన్నారు. తన లక్ష్యం, మా ప్రభుత్వ లక్ష్యం కూడా అదేనని చెప్పుకొచ్చారు. రాజలింగ మూర్తి హత్యను ఖండించారు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వాళ్ల అవినీతిపై ప్రశ్నించిన అడ్వకేట్ వామనరావు దంపతుల హత్య జరిగిందన్నారు. కాళేశ్వరం అక్రమాలపై మొదటి నుంచి పోరాడుతున్న లింగమూర్తి హత్య చాలా బాధాకరమన్నారు. దీని వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని వక్కానించారు.మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి తన అనుచరుల చేత చంపించారని అన్నారు రాజలింగమూర్తి భార్య. తన భర్తను చంపమని కేటీఆర్, వెంకటరమణా రెడ్డికి చెప్పారన్నది ఆమె వెర్షన్. వెంకటరమణ రెడ్డి, సంజీవ్‌తోపాటు మరికొందరు వ్యక్తులు కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కాళేశ్వరం, మేడిగడ్డ అక్రమాలపై తన భర్త కేసు వేసినందుకే చంపించారు ఆవేదన వ్యక్తం చేశారు రాజలింగమూర్తి భార్య.ఈ హత్య కేసులో నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. భూ వివాదాల నేపథ్యంలో లింగమూర్తి స్నేహితుడే ఈ హత్యకు ప్లాన్ చేశాడని ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చారు. సంజీవ్, కొమురయ్య, శ్రీమంత్ మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# నేడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :**
మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో.. మాతృభాష కూడా అంతే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. యునెస్కో 1999 ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాష దినంగా ప్రకటించింది. 2000 ఫిబ్రవరి 21 నుండి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు ) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. 1947 లో భారత దేశం, పాకిస్తాన్ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్ రెండు భౌగోళికంగా వేర్వేరు భాగాలు ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్ అని పిలుస్తారు) రెండవది పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుతం పాకిస్తాన్ అని పిలుస్తారు). సంస్కృతి, భాష మొదలైన వాటిలో రెండు ఒకదానికొకటి చాలా భిన్నంగా ఉండేవి. ఈ రెండు భాగాలను భారతదేశం వేరు చేసింది.తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్ (ఇప్పుడు పాకిస్తాన్ ) కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాష ఎక్కువగా మాట్లాడేవారు.1948 లో అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. దీనికి తూర్పు పాకిస్తాన్ ప్రజలు అభ్యంతరం తెలిపారు.తూర్పు పాకిస్తాన్ జనాభాలో ఎక్కువ భాగం బెంగాలీ మాట్లాడతారు. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తూర్పు పాకిస్థాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా 1948 ఫిబ్రవరి 23 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు (ప్రస్తుతం బంగ్లాదేశ్) నిరసనలు చేపట్టారు. భాష సమాన హోదా కోసం ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్థాన్ ప్రభుత్వం 144 సెక్షన్, ర్యాలీలు, మొదలైనవి ఢాకా నగరంలో నిషేధించింది. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు.1952 ఫిబ్రవరి 21 న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన, ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించారు. పోలీసుల దాడికి నిరసనగా ముస్లిం లీగ్ అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది. 1954 మే 8 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956 లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214 లో బెంగాలీ ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది. యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని 1999 ఫిబ్రవరి 21, న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది.

# రేషన్ కార్డుల పంపిణీనికి అధికారులు చర్యలు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణలో రేషన్ కార్డుల పంపిణీనికి అధికారులు చర్యలు చేపట్టారు. ఒకట్రెండు రోజుల్లో కీలక నిర్ణయం కూడా రానుంది. ఇప్పటికే కార్డు ఎలా ఉండాలనే విషయంపై ప్రభుత్వం ఓ క్లారిటీకి వచ్చినట్లు సమాచారం. డిజైన్‌ను ఓకే చేశారని టాక్ నడుస్తోంది. బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నట్టు ప్రధానమంత్రి ఫొటో మాత్రం పెట్టలేదని సమాచారం. చివరి నిమిషంలో ఏదైనా నిర్ణయం తీసుకుంటే తప్ప ప్రస్తుతానికి మాత్రం మోదీ ఫొటో లేకుండా కేవలం రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు మాత్రమే ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై బీజేపీ నేతలు ఎలా ఫైట్ చేస్తారో అన్న ఆసక్తి నెలకొంది. కార్డును కూడా చాలా భిన్నంగా డిజైన్ చేసినట్టు చెబుతున్నారు. గతంలో చేసినట్టు పెద్దగా చేయకుండా చిన్న ఏటీఎం కార్డులా డిజైన్ చేశారని అంటున్నారు. అందులోనే అందరి పేర్లు వచ్చేలా అని వివరాలు ఉండేలా స్మార్ట్ కార్డు మాదిరిగా ఉంటుంది. దీనిపై ఓ క్యూఆర్ కోడ్ కూడా ఉంటుందని బోగట్టా. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. అందుకే లక్షల్లో జనం ఈ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. అందరికీ ఒకేసారి కార్డులు ఇవ్వాలంటే సమయం పడుతుంది. స్మార్ట్ కార్డులు అయితే త్వరగా ఇవ్వొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీంతోపాటు ఈ రేషన్ కార్డు వినియోగించుకొని మోసాలు చేసే వారికి చెక్ పెట్టాలని చూస్తోంది. నకిలీ బెడద లేకుండా, పక్కదారి పట్టకుండా తప్పు జరగకుండా ఈ స్మార్ట్ యూజ్ అవుతుందని అంచనా వేస్తోంది. వీటన్నింటికీ తోడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కీలక ముందడుగు వేశామని కూడా చెబుతోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఆయా జిల్లాల్లో కాకుండా కోడ్ లేని జిల్లాల్లో పంపిణీనికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతానికి తెలంగాణలో కోడ్ లేని జిల్లాలు మూడే ఉన్నాయి. ఉమ్మడి హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో లేదు. అందుకే ఆ జిల్లాల్లో రేషన్ కార్డుల పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు. మొదటి విడతలో ఒక్కో జిల్లాకు లక్ష కార్డులు పంపిణీ చేయబోతున్నారు. ఈ మేరకు ప్రింటింగ్ పనుల?లో అధికారులు బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మూడు జిల్లాలు అయ్యేసరికి ఎన్నికల కోడ్ తొలగిపోతుందని ఆ తర్వాత మిగతా రాష్ట్రమంతటా కార్డులు పంపిణీ ముమ్మరం చేస్తామని చెబుతున్నారు. రేషన్ కార్డుల అప్లికేషన్లు, రద్దీ, పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పౌరసరఫ రాల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామ సభలు, మీ సేవా కేంద్రా లు, కుల గణన ద్వారా వచ్చిన దరఖా స్తులను వీలైనంత త్వరగా ప్రోసెస్ చేయా లని చెప్పారు. ఎక్కడా డూప్లికేషన్‌కు అవకా శం లేకుండా జాప్యం జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. అదే టైంలో అర్హులకు అన్యా యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వాళ్లు మరోసారి అప్లై చేయకుండా అవగాహన కల్పించాలని చెప్పారు.

**జిల్లాకు లక్ష చొప్పున పంపిణీకి సిద్ధం**

తెలంగాణలో త్వరలోనే రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలు కానుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో పంపిణీ చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొత్త కార్డులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ముందుగా జిల్లాకు లక్ష కార్డులు చొప్పున పంపిణీ చేయనున్నారు. కొత్తగా రూపొందించి రేషన్ కార్డులు ఏటీఎం కార్డు మాదిరిగా




ఉండబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఫొటోతో ఈ కార్డులు వస్తాయని అంటున్నారు. ఈ కార్డులు చాలా స్మార్ట్‌గా ఉంటుందని దానిపై ఓ క్యూఆర్ కోడ్ కూడా ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్ వల్ల ఆ కార్డు వివరాలు వెంటనే తెలుసుకునే వీలుంటుందని అంటున్నారు. ఏటీఎం కార్డులా ఉంటే క్యారీ చేయడం సులభం అవుతుందని చెబుతున్నారు. జేబులో పెట్టుకొని క్యారీ చేయడానికి వీలు అవుతుందని వెల్లడించారు. త్వరగా చినిగిపోదని మన్నిక ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఆ కార్డు వివరాలు త్వరగా తెలుసుకునేందుకు దానిపై క్యూఆర్ కోడ్ కలిగి ఉంటుమంది. ఈ కార్డులో ఎడమ వైపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటో ఉంటుంది. కుడివైపున పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటో ఉంటుంది. మధ్యలో తెలంగాణకు చెందిన లోగో ఉంటుంది. ఇందులో ముందు వైపు కుటుంబ సభ్యులు వివరాలు ఉంటాయి. వారి పేర్లు, వయసు, పుట్టిన తేదీలు ఉంటాయి. అంతేకాకుండా దాని వెనుకాల లబ్ధిదారుడి పేరు చిరునామా, రేషన్ దుకాణం వివరాలు కూడా ముద్రిస్తారు. డీలర్ కాంటాక్ట్ నెంబర్, రేషన్ షాపు సమయాన్ని ముద్రిస్తారు. దీన్ని బయోమెట్రిక్‌తో అనుసంధానించనున్నారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు అంశంపై రివ్యూచేశారు. గతంలో చాలా వేదికపై దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తే ఇంకా ఎందుకు మీ సేవ కేంద్రాల వద్ద జనం ఎగబడుతున్నారని అధికారులను ప్రశ్నించారు. అప్లై చేసిన వాళ్లే పదే పదే చేస్తున్నారని అందుకే మీ సేవ కేంద్రాల వద్ద పరిస్థితి గందరగోళంగా ఉందని తెలిపారు.మీ సేవ కేంద్రాల వద్ద రద్దీ తగ్గించి ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారులకు కార్డుల పంపిణీ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాటిని తప్పించాలని సూచించారు. కోడ్ అమలులో లేని జిల్లాల్లో పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తైనందున ఆయా గ్రామాలకి కూడా లిస్టులు వెళ్లిపోయాయి. ఆన్‌లైన్‌లో కూడా లిస్ట్‌లో పేర్లు చూసుకునే వెసులుబాటు కల్పించారు. ఒకసారి పంపిణీ ప్రక్రియ ప్రారంభమైతే... ఇంకా అర్హులు ఉంటే అప్లై చేసుకుంటారు. అప్పుడు ఇంత రద్దీ ఉండబోదని ప్రభుత్వం భావిస్తోంది.

### కేటీఆర్ వైఖరిపై ప్రభుత్వ విప్

# ఆది శ్రీనివాస్ ఫైర్



**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ ముచ్చట్లు :**
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బీఆర్ఎస్, కేటీఆర్‌లపై మండిపడ్డారు. బిఆర్ఎస్ బరితెగించి వ్యవహరిస్తుంది. అధికారుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ క్షమాపణ చెప్పాలి. సోషల్ మీడియాలో జిల్లా కలెక్టర్ మీద అనేక ఆరోపణ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని 1000 ఎకరాల భూముల ఆక్రమణకు గురయ్యింది. వాటిని స్వాధీనం చేసుకునే ప్రయ త్నంలో వ్యక్తిగత జీవితంలో తొంగి చూస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో మీరు వ్యక్తిగతంగా సినిమా తొంగి చూడలేదా? కలెక్టర్ పై ఎలాంటి కేసు లేదని నేను ఇవాళ మీడియాలో చూశాను. కలెక్టర్ పై కేసులు లేనప్పుడు వ్యక్తి గతంగా అవమాన పరిచినదుకు క్షమాపణ చెప్పాలి. ఎలక్షన్ కోడ్ అమలులో ఉండగా టీ పాయింట్ ఫ్లెక్స్ లో కేటీఆర్ ఉంటే తొలగించినందుకు కలెక్టర్ పై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పదేళ్ల అవినీతి అక్రమ పాలనలో అనేకమంది కార్యకర్తలపై కేసులు నమోదు చేసిన భయపడలేదు. ఐఏఎస్, ఐపీఎస్ ఆధికారులకు మా ప్రభుత్వం అండగా ఉంటుంది. డబుల్ బెడ్రూం లో జరిగిన అవినీతిని బయట తీస్తున్నందుకు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పౌల్ట్రీ ఫామ్‌లో అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృత్యువాత

**-సమీప ప్రాంతాల్లో చికెన్ అమ్మకాలను నిలిపివేయాలి**

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**
జిల్లాలోని మదనాపురం మండలంలోని ఓ పౌల్ట్రీ ఫామ్ లో కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడిన నేపథ్యంలో సమీప ప్రాంతాల్లో చికెన్ అమ్మకాలను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ తో కలిసి మదనాపురం మండల పరిధిలోని కొన్నూరు శివారులోని పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలించారు. కోళ్ళు ఏ విధంగా మృత్యువాత పడాయి అనే విషయంపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని, సంబంధిత కోళ్ల ఫారం యజమానిని ఆరా తీశారు. ఇటీవల బయటకి ఏమైనా కోళ్లు అమ్మారా అని ప్రశ్నించగా, ఎవరికి అమ్మలేదని చనిపోయిన వాటన్నిటినీ ఫామ్ సమీపంలోనే పూడ్చి వేసినట్లు యజమాని బదులిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొన్నూరు గ్రామంలో గాని, సమీపంలో ఉన్న చికెన్ దుకాణాలను తెరవనీయ వద్దని, ఎవరైనా అమ్మకాలు జరిపితే వెంటనే బైండోవర్ చేసి, చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌కు ఆదేశించారు. ఎవరూ చికెన్ అమ్మడానికి వీల్లేదని ఆదేశించారు. సమీపంలోని ఇతర పౌల్ట్రీ ఫారం లను సైతం పశు సంవర్ధక శాఖ అధికారులు సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ఏదైనా ఫామ్ లో కోళ్లకు అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే స్టాక్ బయటికి వెళ్లకుండా ఆపివేయాలని ఆదేశించారు. కొన్నూరు సంఘటనపై శాంపిల్స్ విబిఆర్ఐ కి పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్ట్స్ వచ్చిన తర్వాత కారణాలు ఏంటి అనే వివరాలు తెలుస్తాయని చెప్పారు. కొన్నూరు పౌల్ట్రీ ఫార్మ్ ఘటనపై కోడి పిల్లలు సరఫరా చేసిన సంబంధిత కంపెనీ ప్రతినిధులను పిలిపించి విచారణ చేయడం జరుగుతుందని చెప్పారు.ఈ సందర్భంగా కలెక్టర్ కొన్నూరు గ్రామంలో పర్యటించి చికెన్ దుకాణాలను తనిఖీ చేశారు. చికెన్ అమ్మడానికి వీల్లేదని దుకాణదారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, తహసిల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీవో, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## గ్రామంలోని ప్రభుత్వ భూములను రక్షించండి

**హసన్‌పర్తి, తెలంగాణ ముచ్చట్లు :**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామంలో అంగడి భూమిని, చేపల ఉత్పత్తి కేంద్రం యొక్క భూమిని రక్షించాలని అంగడి స్థలంలో గ్రామస్తులు ధర్నా చేశారు. ఎల్లాపూర్ గ్రామంలోని 316 సర్వే నంబర్ లో గల నాలుగు ఎకరాల 15 గుంటల అంగడి భూమి, చేపల ఉత్పత్తి కేంద్రం,చాపల బాయి 246 సర్వే నెంబర్లో గల 12 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ భూములను అక్రమార్కులు కాజేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని గతంలో ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. గతంలో తాతలు,తండ్రులు దానం చేసిన భూమిని ఇప్పటి వారసులు మాది అని అంటూ అధికారులతో కుమ్మక్కై రాజకీయ పలుకుబడి ఉపయోగించి ధరణిలో పట్టాలో పేరు మార్చి భూమి మాది అంటూ అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారని వీరికి సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి ప్రభుత్వ భూమిని రక్షించాలని లేనిచో రాస్తారోకోలు ధర్నాలు ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

## జ్ఞానసమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యం

**- స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిన వీరయ్య**

**- స్వేరోస్ ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవం**

**- జిల్లా అధ్యక్షులుగా మొండితోక ఈదయ్య**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



జ్ఞానసమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యంగా పనిచే యాల ని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిన వీరయ్య అన్నారు. ఖమ్మం నగరంలో గురువారం జరిగిన స్వేరోస్ సమావేశంలో ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వేరోస్ ఖమ్మం జిల్లా నూతన కమిటీని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య ప్రకటించారు. స్వేరోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా మొండితోక ఈదయ్య, కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షులుగా తగరం శ్రీకాంత్, మహేష్, గోవిందరాజు, కోశాధికారి రమణ, అధికార ప్రతినిధి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు సుధాకర్, వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాధవి, కిరణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నరసింహరావు, కృష్ణయ్య, మల్సూర్ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరయ్య మాట్లాడుతూ... జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ పనిచేయాలని పిలుపునిచ్చారు.

# దడ పుట్టిస్తున్న విధి కుక్కలు

**▸▸ ఇర్కిచెట్టి జయమ్మ అనే మహిళపై విధి కుక్కల దాడి**

**▸▸ గ్రామంలో తరచుగా వారానికి 4-5 కేసులు నమోదు**

**▸▸ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన, పత్రికల్లో వార్త కథనాలు వచ్చిన పట్టించుకోని అధికారులు**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు :**



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో రోజు రోజుకు విధి కుక్కల బెడద ఎక్కువైందని కాలనీలలో తిరగాలంటే భయాందోళనకు గురవుతున్నామని గ్రామస్థులు మండిపడుతున్నారు. గురువారం జయమ్మ అనే మహిళపై విధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.విధి కుక్కల సమస్యలను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సిబ్బంది వివరాల ప్రకారం వారానికి 4-5 విధి కుక్కల దాడిలో గురైన కేసులు వస్తున్నాయని తెలిపారు.గ్రామంలో ఎక్కడ చూసిన విధి కుక్కలు భారీగా తిరుగుతూ దారిలో వెళ్తున్న ప్రజలపై, చిన్నారులపై దాడి చేస్తూ... గాయ పరుస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే మరింతమంది విధి కుక్కలకు బలి కావాల్సిన పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుండు కాపడలని కోరుతున్నారు.

# వైద్యులు అందుబాటులో ఉండాలి

**- రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.**

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ జిల్లా బ్యూరో తెలంగాణ ముచ్చట్లు:**





చేగుంట మండల కేంద్రంలోని గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. డాక్టర్‌లతో రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రిని ఎల్లవేళల పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు.డాక్టర్‌తో వివిధ రకాల వార్డులను జిల్లా కలెక్టర్ సందర్శించి రోగులను పలకరించారు. ఎలా ఉన్నారు ఎక్కడి నుండి వచ్చారు, వైద్యం అందుతున్నదా డాక్టర్‌లు వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సిబ్బంది, తదితరులున్నారు.

# అగ్రరాజ్యానికి కేసీఆర్..?

మొదటిపేజీ తరువాయి

తెలుస్తోంది. పార్టీ ఇంతలా దిగజారి పోవటానికి మీరే కారణమని కొందరు సీనియర్లు తప్పుబట్టారని తెలుస్తోంది. తొలుత ఇంటి సమస్యలు సరిదిద్దుకుంటే, ప్రత్యర్థులకు ధీటుగా బదులు ఇవ్వవచ్చని చెప్పినట్టు సమాచారం. ఒకానొక దశలో యువనేతపై కేసీఆర్ కాసింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల మాట. ఇంటిని చక్కదిద్దుకునే పనిలో భాగంగా హాజరైన నేతల నుంచి అభిప్రాయసేకరణ చేశారు.పార్టీలకు అనుగుణంగా బహిరంగ సభ నిర్వహణ, కొన్ని కమిటీలకు ఇన్‌ఛార్జ్‌గా హరీష్‌రావుకు బాధ్యతలు అప్పగించారు కేసీఆర్. ఆ విషయాన్ని మీడియా సమావేశంలో కేటీఆర్ వెల్లడించారు. గత ఎన్నికల్లో మహిళలు బీఆర్ఎస్‌ను చావదెబ్బ కొట్టారని కేసీఆర్‌కు పలు నివేదికలు అందాయి. ఈ నేపథ్యంలో పార్టీలో మహిళలకు పెద్ద పీఠ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో ప్రత్యేకంగా మహిళా విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దానికి అధ్యక్షురాలిగా కవితను నియమించే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం.మరోవైపు కేసీఆర్ అమెరికా టూర్ వెళ్లాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాల మాట. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదిక తుది దశకు చేరింది. రేపో మాపో రేవంత్ ప్రభుత్వానికి అందజేయనుంది. ఈ నేపథ్యంలో ఆయన అమెరికా టూర్‌కి శ్రీకారం చుట్టడంపై పలు అనుమానాలు మొదలయ్యాయి. ఇందులోభాగంగా ఫామ్ హౌస్ నుంచి పార్టీ ఆఫీసుకు వెళ్లకుండా కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసుకు వెళ్లారని అంటున్నారు.ప్రభుత్వం మారిన వెంటనే డిప్లమాటిక్ పాస్‌పోర్టును అప్పగిస్తారు మాజీ ముఖ్యమంత్రులు. ఏడాది తర్వాత డిప్లమాటిక్ పాస్‌పోర్టు ఇవ్వరని అంటున్నారు. ఈ క్రమంలో ఏపీ జగన్ విషయాన్ని గుర్తు చేశారు. ఇక కేసీఆర్ అమెరికాలో ఉండేందుకు రెండునెలలుగా తెర వెనుక ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా కేసీఆర్ ఫారెన్ టూర్ వెళ్లడం పక్కాగా ఖాయమన్నమాట.

## ఉచిత న్యాయ సహాయం సలహాలపై అవగాహన

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చీకరు చెట్టు తండాలో 21వ తేదీ శుక్రవారం ఉచిత న్యాయ సహాయం సలహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని గ్రామ మాజీ సర్పంచ్ రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ అధికార సేవా సంస్థ కార్యదర్శి జిల్లా సీనియర్ న్యాయమూర్తి రజిని ఆధ్వర్యంలో న్యాయ సహాయంపై సలహాలు ,సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు, నిరుపేదలకు, రైతులకు సైతం ఉచిత న్యాయ సహాయం సేవలు అందించేందుకు ,చట్టాలపై అవగాహన ఉచిత న్యాయ సలహాలపై అవగాహన కల్పించనున్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండే విధంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నారని మాజీ సర్పంచ్ రాధాకృష్ణ తెలిపారు. నేడు నిర్వహించే ఉచిత న్యాయ సహాయం సలహాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు

మొదటిపేజీ తరువాయి

మృతుడిపై భూ వివాదాల ఆరోపణలు ఉన్నాయి.. రౌడీ షీట్ కూడా ఉంది. బీఆర్ఎస్‌పై, నాపై ఆరోపణలు చేయడం ద్వారా విచారణను ప్రభావితం చేయడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. హత్యలో అరెస్టయిన వ్యక్తుల పేర్లతో రాజలింగ మూర్తి పోలీసులకు పిర్యాదు కూడా చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి మతి భ్రమించింది. బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారు అని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు.హత్యారాజకీయాలు కాంగ్రెస్ పార్టీకి అలవాటు.. బీఆర్ఎస్ హత్యా రాజకీయాలను ప్రోత్సహించదు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపై కూడా కోమటిరెడ్డి నల్లగొండ మున్సిపల్ చైర్మన్‌ను హత్య చేశారని ఆరోపించారు. వేముల వీరేశం ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. కోమటిరెడ్డి పూటకో మాట మాట్లాడతా రు.. ఆయన నోటికి మొక్కాలి. పోలీసులు నిస్పాక్షిక విచారణ జరిపి దోషులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి. కాంగ్రెస్ నేతలు కుటిల రాజకీయాలు మానుకుంటే మంచిది అని గండ్రా వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు.

## తెలంగాణలో రంజాన్ రచ్చ..?

మొదటిపేజీ తరువాయి

ఈ సడలింపు విధానం మొదలు పెట్టింది. పదేళ్లు కొనసాగించింది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా పాత ఉత్తర్వులనే ఇచ్చింది. వారు స్పెసిఫిక్‌గా ఆ సమయంలో ప్రార్థనలకు వెళ్లాలి కాబట్టి అవకాశం కల్పిస్తున్నారు. గతంలో ఎవరూ అభ్యంతరం తెలుపలేదు. కానీ ఈసారి బీజేపీ దీనిని తప్పుపడుతోంది. ప్రభుత్వం తీరుపై విమర్శలు చేస్తోంది. అలాంటి ఛాన్స ఇవ్వడం కరెక్ట్ కాందటున్నారు ఆ పార్టీ నేతలు. ముస్లింలకు అవకాశం ఇస్తే మీకేం ఇబ్బంది అంటున్నారని, హిందువులకు ఇవ్వలేదు కదా అంటున్నారు. ఇక్కడే అసలు రాజకీయం మొదలైంది.బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు అధికార కాంగ్రెస్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. హిందువుల పండుగలకు కూడా అవసరమైనప్పుడు వెసులుబాటు ఇస్తున్నామని చెబుతోంది. అయినా బీజేపీ హిందువులకు ఇవ్వడం లేదని గట్టిగా వాయిస్ వినిపిస్తోంది. కాంగ్రెస్ ఎంపీ ఛామల కిరణ్‌కుమార్‌రెడ్డి వివరణ ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. దీంతో చర్చను మరింత పెంచింది. అయితే కాంగ్రెస్ వివరణ ఇచ్చుకునే తీరు ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.ముస్లింలకు వెసులుబాటు కల్పించడం కొత్తేమీ కాదు. కానీ బీజేపీ నేతలు కలిసివచ్చే అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. వచ్చే ఎన్నికలనాటికి బీజేపీ కాంగ్రెస్ మధ్యే పోటీ ఉండాలని బీజేపీ భావిస్తోంది. అప్పటి వరకు బీఆర్ఎస్‌ను బలహీనపర్చాలని రెండు జాతీయ పార్టీలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే రెండు పార్టీలు వీలు దొరికినప్పుడల్లా.. బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్నాయి.

## రాకేష్‌కు సీఎం రేవంత్ చేయూత

మొదటిపేజీ తరువాయి

మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెంది న గూళ్ల రాకేష్ చాలా కాలం సూడో మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే కండరాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల వ్యాధి తీవ్రత.. పెరగడంతో నడవలేని పరిస్థితికి వచ్చాడు. అయితే రాకేష్ కు ఆరోగ్యం మెరుగు కావాలంటే ఖరీదైన ఇంజక్షన్లను క్రమం తప్పకుండా ఇవ్వాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న రాకేష్ కుటుంబం ఖరీదైన వైద్యం చేయించలేకపోతుందని, పత్రికలో వచ్చిన కథనంపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. ములకనూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో రాకేష్ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. స్వగ్రామం నుంచి ములకనూరు వెళ్లి రావడానికి చార్జింగ్ వెహికల్ ను కూడా ప్రభుత్వం అందించనున్నది. తమ బిడ్డను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాకేష్ తల్లిదండ్రులు గూళ్ల సమ్మయ్య, లక్ష్మి ధన్యవాదాలు తెలిపారు.

## ఉపాధి కూలీగా మారిన కలెక్టర్

**ఇల్లెందు, తెలంగాణ ముచ్చట్లు :**
ఆయన ఒక మధ్యతరగతి సాధారణ కుటుంబంలో పుట్టారు. ఉన్నత చదువులు చదివి జిల్లా కలెక్టర్ అయ్యారు. విధి నిర్వహణలో భాగంగా ఉపాధి కూలీ పనులను పరిశీలించడానికి వచ్చారు. చూసి ఊరికే ఉండకుండా ఉపాధి కూలీలతో కలిసి పలుగు పట్టి మట్టిని తవ్వి, పారతో మట్టిని తట్టలో ఎత్తి మోశారు. ఆయనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ . గురువారం ఉదయం కలెక్టర్ జితేష్ పాటిల్.. టేకులపల్లి మండలంలోని సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రు తండా, కొత్త తండా గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి పలుగు పారా పట్టి పారం పాండు పనుల్లో పాల్గొన్నారు. స్వయంగా మట్టిని తట్టలోకి ఎత్తి దానిని మోశారు.



## రాజలింగ మూర్తి హత్య వెనుక కెసిఆర్ హరీష్ రావులు

**చిన్నకోడూరు, తెలంగాణ ముచ్చట్లు ::**
కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ హరీష్ రావులు అవినీతికి పాల్పడుతున్నారని భూపాలాపల్లి జిల్లాకు చెందిన వ్యక్తి రాజలింగం గతంలో కోర్టులో కేసు వెయ్యటం జరిగింది. ఈరోజు హైకోర్టు లో విచారణ ఉన్న సమయంలో నిన్న సాయంత్రం సమయంలో రాజలింగం ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో అతి దారుణంగా హత్య చేయటం జరిగింది. కోర్టులో విచారణ జరిగితే కెసిఆర్ హరీష్ రావులు చేసిన అవినీతి బయటకి వసుంది అనే భయంతోనే కావాలనే కెసిఆర్ హరీష్ లు పక్క ప్రణాళికతో రాజలింగంను హత్య చేయటం జరిగింది. అని కాంగ్రెస్ నాయకులు అన్నారు.కాబట్టి ఇట్టి విషయం పై కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా విచారణ పూర్తి చేసి సామాజినా సమస్యల మీద పోరాటం చేసే వ్యక్తులకు నమ్మకం కలిగించాలి అని ప్రభుత్వాన్ని కోరటం జరుగుతుంది అన్నారు.హరీష్ రావును పాపం అని వదిలి పెట్టొద్దు ప్రజా సమస్యల మీద పోరాటం చేసే వారిని అందరిని విపరీతంగా మానసికంగా ఇబ్బందులకు గురించేయంటం చాలా మంది చావులకు హరీష్ కారణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు అంకర్ మధు, జిల్లా సీనియర్ నాయకులు మిట్టపల్లి కానుకరాజు, మండల ఓబీసీ ప్రధాన కార్యదర్శి కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నోచుకోని ఎర్ర చెరువు



**మందమర్రి టౌన్, తెలంగాణ ముచ్చట్లు :**
అదిల్ పేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్ర చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం అదనంగా కొనుగోలు చేసిన భూమి హద్దులను గుర్తించి చెరువు ఆయకట్టు రైతులకు నీరు అందేలా చూడాలని బహుజన్ సమాజ్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి ముల్కల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేస్తూ గురువారం మందమర్రిలో ని ఇరిగేషన్ కార్యాలయంలో డివిజనల్ ఇంజనీర్ శారదకు వినతిపత్రం అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల క్రితం చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన వ్యవసాయ భూములను సంబంధిత శాఖ స్వాధీనం చేసుకోకపోవడం వలన రైతుల ఆధీనంలోనే ఉన్న భూములను తక్షణమే స్పందించి చెరువు అభివృద్ధి కోసం కొనుగోలు చేసిన భూములను రికార్డుల నుంచి తొలగించి సంబంధిత శాఖ స్వాధీనం చేసుకొని హద్దులను గుర్తించి చెరువు పూడిక తీసి ఆయకట్టు రైతులకు నీరు అందించేలా చూడాలని లేనియెడల బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన కార్యక్రమం చేపడతామని డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సింగతి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం**

## జిల్లా అధ్యక్షులుగా ఎన్.దివ్యదర్శన్ రావు

**పెద్దపల్లి - తెలంగాణ ముచ్చట్లు :**



తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం పెద్దపల్లి జిల్లా శాఖ ఎన్నికలు జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యాలయాల నిర్వహణ అధికారి కె. నరేందర్ అద్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షునిగా ఎన్ దివ్య దర్శన్ రావు (ఎంపీడీవో సుల్తానాబాద్) ప్రధాన కార్యదర్శిగా కే .శ్రీనివాస్( ఎంపీడీవో పెద్దపల్లి ) కోశాధికారిగా ఎం సురేష్ (ఎంపీడీవో ముత్తారం )ఉపాధ్యక్షులుగా బి శైలజ (ఎంపీడీవో రామగిరి) ప్రచార కార్యదర్శిగా జి.తిరుపతి (ఎంపీడీవో ఓదెల )అసోసియేట్ సెక్రటరీగా రామ్మోహనాచారి (ఎంపీడీవో పాలకుర్తి ) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వై భాస్కర్ రావు (ఎంపీడీవో ఎలిగేడు) ఐ.ప్రవీణ్ కుమార్ (ఎంపీడీవో ధర్మారం)లను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం

**మందమర్రి టౌన్ , తెలంగాణ ముచ్చట్లు :**



ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంను శుక్రవారం చెన్నూరు పట్టణంలోనీ ఎంఆర్ ఆర్ గార్డెన్లో చెన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరు పట్టణంలో శుక్రవారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డ వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతునరని కావున ఈ సమావేశానికి మందమర్రి పట్టణ పట్టభద్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ ఇన్చార్జులు ఈ కార్యక్రమానికి పట్టభద్రులను అధిక సంఖ్యలో తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో సొత్కు సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి నైపుణ్య శిక్షణాభివృద్ధి కేంద్రం ఏర్పాటు

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెల్ల లోని సాగునీటి పారుదల శాఖకు సంబంధించిన పాత భవనాలు ఖాళీగా ఉండటంతో అందులో మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు.గురువారం ల్యాదెల్ల గ్రామంలోని సాగునీటి పారుదల శాఖ సంబంధించిన భవనాలను వివిధ శాఖల అధికారులతో కలిసి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో కలెక్టర్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లా డుతూ మహిళా సంఘాల సభ్యులకు ఆసక్తి ఉన్న రంగాలలో పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు వారికి నైపుణ్యాభివృద్ధిని సాధించే విధంగా నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఇరిగేషన్ కు చెందిన పాత భవనాలకు మరమ్మతు పనులతో పాటు తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, టాయిలెట్స్, విద్యుత్తు, లైటింగ్, పెయింటింగ్, తదితర పనులు పూర్తి చేసినట్లయితే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం తో పాటు చిన్న తరహా ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయవచ్చునని పేర్కొన్నారు. మండలంలోని స్వయం సహాయక సంఘాలకు కావాల్సిన శిక్షణ, వనరులను సమకూర్చేందుకు పరిశీలించి నట్లు తెలిపారు. వి- హబ్ , పరిశ్రమలు, ఐటి శాఖలతో ఒప్పందం చేసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంతో పాటు చిన్న తరహా



ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు అన్ని అవకాశాలను పరిశీలి స్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలు నైపు ణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను తయారు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జనపనార ( జ్యూట్) సంచుల తయారీ, ఇతర జ్యూట్ ఉత్పత్తులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టేందుకు, మహిళలకు మిషన్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, బ్రాండింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కుట్లు అల్లికలు, మగ్గం, రెడీమేడ్ దుస్తుల తయారీ, కంప్యూటర్, తదితర అంశా లలో శిక్షణను ఇచ్చేందుకు ఈ శిక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి



తీసుకురానున్నారు. ఈ కార్య క్రమంలో ఆర్డీ వో డాక్టర్ నారాయణ, తహసీల్దార్ డీఆర్డీవో మేన శ్రీను, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, పరకాల జ్యోతి వర లక్ష్మీదేవి,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు పెద్దపల్లికి కేంద్ర హెూంసహాయమంత్రి బండి సంజయ్

**పెద్దపల్లి- తెలంగాణ ముచ్చట్లు :**
పెద్దపల్లి - ఫిబ్రవరి, 20 ( న్యూస్ 10): ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రం హెూం సహాయమంత్రి బండి సంజయ్ పెద్దపల్లిలో నేడు జరిగే పచ్చీస్ ప్రభారీ సమావేశంలో పాల్గొంటారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 27న జరగబోయే ఉపాధ్యాయ, పట్టభధ్రుల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలు, బూతుల వారిగా ఇప్పటికే ఇంచార్జీలను నియమించినట్లు తెలిపిన ఆయన, ప్రతీ 25మంది



ఓటర్లకు ఒక సంపర్క్ ప్రభారీ ఉంటాడని వివరించారు. సంపర్క్ ప్రభారీలకు మార్గనిర్దేశనం చేయడంలో భాగంగా బండి సంజయ్ తో పాటు ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, పాయల్ శంకర్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని కార్యకర్తలు, నాయకులు, ఎన్నికల ఇంచార్జీ లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని నందన గార్డెనులో ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని సంజీవరెడ్డి తెలిపారు.

## మహిళలు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పకడ్బందీ సేవలు అందాలి.

**పౌష్టికాహార సరుకులు అంగన్వాడీలకు రెగ్యులర్ గా సరఫరా చేయాలి**

**మానసిక వైకల్యం గల పిల్లలను మనో చైతన్య పాఠశాలలో చేర్పించాలి**

**ప్రీ స్కూల్ లో పిల్లలకు బోధన పకడ్బందీగా జరగాలి**

**రామగుండం పరిధిలోని అంగన్వాడి కేంద్రాల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి - తెలంగాణ ముచ్చట్లు :**
మహిళలు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పకడ్బందీ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం పురపాలక కార్యాలయంలో రామగుండం పరిధిలోని అంగన్వాడి కేంద్రాల పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రతి సూపర్వైజర్ తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ అవసరమైన పౌష్టికాహారం సెంటర్ కు అందుతుందా, గర్భిణీ మహిళలకు, బాలింతలకు పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరుగుతుందా వివరాలు తెలుసుకోవాలని, అంగన్వాడి కేంద్రాలకు పౌష్టికాహార సరుకులను రెగ్యులర్ గా పంపిణీ చేయాలని కలెక్టర్ తెలిపారు. న్యూట్రిషన్ కు సంబంధించి వాస్తవిక పరిస్థితులు నమోదు చేయాలని, ఎంత ఎక్కువ మంది గుర్తిస్తే అంత మంచిదని , పోషక లోపంతో బాధపడే పిల్లలకు బాల అమృత్ ప్లేస్‌లో అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతినెల పిల్లల బరువు చెక్ చేయాలని, తక్కువ



బరువు ఉన్న పిల్లలకు అవసరమైన పోషకాలు అందించాలని కలెక్టర్ సూచించారు. మానసిక వైకల్యం గల పిల్లలను ముందుగానే గుర్తించి వారిని మనో చైతన్య పాఠశాలలో జాయిన్ చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో క్రోనిక్ వ్యాధులు గుర్తించిన 14 మందికి జిల్లా వైద్యా శాఖ ద్వారా అవసరమైన పరీక్షలు నిర్వహించి చికిత్స అందేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ , సిడిపిఓ అలేఖ్య,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో అనుమానాస్పదంగా హెూంగార్డు మృతి?

**ఖమ్మం జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :**
ఈతకు వెళ్లిన హెూంగార్డు ప్రమాదవశాత్తు సాగర్ కాలువలో పడి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.ఖమ్మం జిల్లా నేలకొండపల్లి డిగ్రీ కాలేజ్ సమీపంలో మినీహైడల్ పవర్ ప్రాజెక్టు వద్ద అటుగా వెళ్లిన స్థానికులు కాలువలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచార మిచ్చారు.అనంతరం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు మండల కేంద్రం లోని పీఎస్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హెూంగార్డు గంటా నరేష్ (36)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.





## ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలి

**ధర్మారం - తెలంగాణ ముచ్చట్లు :**
ఎమ్మెల్సీ నరేందర్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మారం మండల కేంద్రంలోని గౌతమ బుద్ద పంక్షన్ హాల్లో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రు లు , పార్టీ నాయకులు,కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కష్టపడి ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేసి నరేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ధర్మపురి నియోజకవర్గ పట్టబద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి 2వ నెంబరుపైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని,బిజెపి నాయకులు ఓటు అడగడానికి వస్తే మా నియోజకవర్గానికి సంబంధించిన నేరెళ్లకు మంజూరైన నవోదయ పాఠశాలను బిజెపి ఎంపీ అరవింద్ తరలించకపోవాలని చూస్తున్నారని, మా ప్రాంతం అభివృద్ధి చెంద డం ఎంపి అరవింద్‌కి ఇష్టం లేదని బిజెపి నాయకులను ప్రశ్నించాలని తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరు ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను కలిసి మన ప్రభుత్వం చేపడుతున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,నేడు ఉదయం ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘంలో నిర్వహించే శ్రీధర్ బాబు ఎన్నికల ప్రచార సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.ఈ సమావేశంలో ఎఎంసి చైర్మన్ రూప్లానాయక్, మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**
ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో తగిన మూల్యం చెల్లించుకుంది. ప్రస్తుతం ప్రభుత్వం మార్చి వరకు గడువు కోరిన నేపథ్యంలో వేచిచూస్తున్నామని, అప్పటివరకు పరిష్కారం లేకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య హెచ్చరించారు. గురువారం సత్తుపల్లిలోని సంఘ భవనంలో పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. యూనిట్ అధ్యక్షుడు కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పెన్షనర్ల సమస్యలు, ప్రభుత్వ వైఖరిపై విశ్రాంత ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళ్యాణం కృష్ణయ్య మాట్లాడుతూ, గత ప్రభుత్వాన్ని మార్చడంలో విశ్రాంత ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని, కానీ నూతన ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలకు వైద్యం అందించే ఆరోగ్య పథకాన్ని అమలు చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి శరత్ బాబు మాట్లాడుతూ, పెన్షన్ భారం నుంచి తప్పించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్, యూపీఎస్ పథకాలను ప్రవేశపెట్టే యత్నం చేస్తున్నాయని విమర్శించారు. దశాబ్దాల పాటు ప్రభుత్వానికి సేవలందించి చివరికి వృద్ధాప్యంలో ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపులకు ప్రస్తుతం అమల్లో ఉన్న 'ఈ-కుబేర్' విధానం వారికి తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్



చేశారు. పెన్షనర్స్ డే సందర్భంగా గత ఏడాది ఉద్యోగ విరమణ చేసిన 27 మంది వివిధ శాఖల విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. సమావేశంలో హెల్త్ కార్డుల మంజూరు, ఈహెచ్ఎస్ పథకం అమలు, ఈ-కుబేర్ విధానం తొలగింపు, జిల్లా స్థాయిలో నిధుల విడుదల, ఓల్డ్ పెన్షన్ విధానం పునరుద్ధరణ వంటి ప్రధాన అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు చెంచిరెడ్డి, రఘుపతి రెడ్డి, సత్తుపల్లి యూనిట్ నాయకులు బద్రుద్దీన్, ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, బూరుగు దాసు, సీతయ్య, సాంబశివరెడ్డి, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.



## మాతృభాష మృత భాష కాకూడదు

**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**
భాషను చదవడం, రాయడం, మాట్లాడడం మర్చిపోతే అది కాలక్రమేణా మృత భాషగా మారుతుందని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు హెచ్చరించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21) సందర్భంగా గురువారం విశ్వశాంతి విద్యాలయంలో మాతృ భాషపై అవగాహన కల్పించేందుకు వివిధ పోటీలు నిర్వహిం చారు. విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలు నిర్వహి ంచి, విజేతలకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. వేమన పద్యాలను చూడకుండా అనర్గళంగా చెప్పిన 25 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగేశ్వర రావు మాట్లాడుతూ, మాతృభాష హక్కు కోసం బెంగాల్లో జరిగిన ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన విద్యార్థుల త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21ను ప్రపంచ మాతృభాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. యునెస్కో నిర్ణయం మేరకు 1999 నుంచి ప్రపంచవ్యాప్తంగా 188 దేశాల్లో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. ప్రపంచంలో 7,000 భాషలు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు 2,400 భాషలు అంతరించిపోయాయని, భవిష్యత్తులో మరిన్ని భాషలు మునిగి పోకుండా అందరూ మాతృభాష పట్ల గౌరవం చూపించాలని అన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆంగ్లం వంటి ఇతర భాషలు నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నా, మాతృభాషను విస్మరించరాదని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శైలజ, రమణమూర్తి, మణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**
సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిదయానంద్ గురువారం పట్టణంలోని రాజీవ్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలలో ఆత్మీయ పలకరింపు చేశారు. రాజీవ్ కాలనీకి చెందిన షేక్ అబేద్, మహిరూన్‌ల కుమార్తె షేక్ సమీరా - వరుడు మహ్మద్‌ల నిఖా వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. తర్వాత లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్‌లో ఎన్టీఆర్ కాలనీకి చెందిన షేక్ కరీముల్లా, ఆఫ్రిద్‌ల కుమార్తె షేక్ ఆర్మీయ - వరుడు షేక్ అబ్దుల్‌ల నిఖా వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వధువును



ఆలింగనం చేసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, చల్లగుళ్ళ నరసింహారావు, కమాల్ పాషా, రఫీతో పాటు కాలనీలకు చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## తిరుమలపై మరోసారి విమానం చక్కర్లు

**తిరుమల, తెలంగాణ ముచ్చట్లు :**
తిరుమల శ్రీవారి ఆలయంపై నుంచి మరోసారి విమానం వెళ్లడం తీవ్ర కలకలం సృష్టిస్తున్నది. గత కొంత కాలంగా శ్రీవారి ఆలయంపై నుంచి తరచూ విమానాలు తిరుగుతుండటంత తెలిసిందే. తాజాగా గురువారం ఉదయం ఆలయం గోపురం మీదుగా ఓ విమానం వెళ్లింది. దీని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎటుంటి రాకపోకలు సాగించకూడదు. అయితే ఈ విధంగా తరచూ శ్రీవారి ఆలయంపై నుంచి విమానాలు వెళ్లడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తుంగభద్రలో మునిగి మహిళా డాక్టర్ మృతి

**బెంగళూరు,తెలంగాణ ముచ్చట్లు :**
ఆ మహిళా వైద్యుల బృందం చేసిన విహార యాత్ర విషాదయాత్రగా మిగిలింది. సరదాగా ఈతకు దిగితే వారిలో ఒకరు గల్లంతయ్యారు. సహాయక బృందాలు రంగంలోకి దిగినా అప్పటికే ఆలస్యమైంది. మృతదేహాన్ని మాత్రమే వెలికి తీయగలిగారు. కర్ణాటకలోని కొప్పల్ జిల్లాలోని తుంగభద్ర నది వద్ద ఈ విషాదం జరిగింది. మృతురాలు హైదరాబాద్‌కు చెందిన 27 ఏళ్ల యువ వైద్యురాలు అనన్య రావు. అనన్య రావుకు ఈత అంటే సరదా. తన స్నేహితులు సాత్విన్, హషితలతో కలిసి ఆమె హంపీ టూర్‌కు వెళ్లారు. అక్కడ పర్యాటక ప్రాంతాల్లో విహరించి.. మంగళవారం రాత్రి సణాపుర గ్రామంలోని ఓ అతిథి గృహంలో బస చేశారు. బుధవారం మధ్యాహ్నం ఈత కొట్టేందుకు తుంగభద్ర నదికి వెళ్లారు. ఈత కొట్టడాన్ని ఇష్టపడే అనన్యరావు ఏకంగా 25 అడుగుల ఎత్తు నుంచి నీళ్లలోకి దూకారు. ఆ సమయంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఆ ఉద్ధృతిలో ఆమె కొట్టుకుపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. వెంటనే గజ ఈతగాళ్లు నీళ్లలోకి దూకి.. ఆమె కోసం రాత్రి దాకా గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం ఆమె మృతదేహాన్ని వెలికి తీశారు. అనన్య రావు నీళ్లలోకి దూకిన వీడియోలు నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి.

## కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం

**జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత**

**జగిత్యాల, తెలంగాణ ముచ్చట్లు :**
కాంగ్రెస్ పాలన అంటేనే కరువు, కన్నీళ్ళకి కేరాఫ్ అని జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత-సురేష్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశానికి వెన్నుముక గా రైతును భావించే ఈ దేశంలో ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వ పాలనలో రైతు దుస్థితి అత్యంత దుర్భరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు అవసరమైన ఎరువులు,నీరు లేక రైతులు అరిగోస పడుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం విచారకరం అన్నారు. కేసీఆర్ పాలనలో సకాలంలో ఎరువులు, విత్తనాలు, నీళ్లు, కరెంట్ అంద జేశారని గుర్తు చేశారు. జగిత్యాల సభలో ఎన్నికల సమయంలో కేసీఆర్ మాట్లాడిన పరిస్థితిలే నేడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గొచరిస్తున్నాయని కాంగ్రెస్ కు ఓటేస్తే గోస పడుతారని, రైతులకు రుణమాఫీ, రైతు బంధు రాదని పేర్కొన్నరన్నారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలో ఇటీవల ఎండిన పంటలను చూశామని, టేలెండ్ గ్రామాలకు నీరందించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి, మోరపల్లి లో తూములు మారమ్మత్తు చేయక నీరండే పరిస్థితి లేకపోవడంతో నీళ్లు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సహకార సంఘాల పాలకవర్గాలు రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని యూరియా ఇండెంట్ కోసం డబ్బులు కట్టిన యూరియా సరఫరా చేయడం లేదన్నారు. బఫర్ స్థాక్ నిల్వలు కూడా లేక పోవడం, ఆలోచన చేయకపోవడం సరికాదన్నారు. అధికారులకు పంటల సాగు వివరాలు అందుబాటులో లేకపోవడం వల్లనే యూరియా నిల్వల పై అవగాహనా,అంచనా లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో సమీక్ష జరిపి యూరియాను అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. కేసీఆర్ పై ఉన్న కోపాన్ని రైతులపై చూపించవద్దని వసంత విజ్ఞప్తి చేశారు. రైతు బంధావుడు రేవంత్ రెడ్డి అని చెప్పి పార్టీ మారిన ఎమ్మెల్యే, రైతులు పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు అవసరం అయిన ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు, పంటలు కాపాడుకునేందుకు అవసరం అయిన నీళ్లను విడుదల చేసి పంటలను రక్షించాలని కోరారు.

# ఏడాదికి రెండు సార్లు సీబీఎస్ఈ పరీక్షలు

**న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు :**
విద్యార్థులకు సెంట్రల్ బోర్ట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఇకపై ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించనుంది. అన్నీ కుదిరితే 2026 నుంచే ఈ విధానం కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి, సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్వీఎస్) ఉన్నతాధికారులతో మంగళవారం సమావేశం జరిగింది. దీనికి సంబంధించిన ముసాయిదాను ఏర్పాటు చేయగా.. వచ్చే సోమవారం నుంచి దీనిపై ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇది అమలులోకి వస్తే విద్యార్థులకు పరీక్షల స్ట్రెస్ ఇక ఉండదనే చెప్పాలి. అంతేకాదు వారి స్కోర్ మరింత పెంచుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2026-27 విద్యా సంవత్సరం నుంచి గ్లోబల్ కరిక్యులమ్ కూడా అందుబాటులోకి తీసుకురావలని సీబీఎస్సీ బోర్డు యోచిస్తుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా అన్ని సీబీఎస్సీ అనుబంధ స్కూళ్లలో ఒకే విధమైన సిలబస్ ఉంటుందన్నమాట. ఏడాదికి రెండుసార్లు నిర్వహించే బోర్డు పరీక్షల్లో.. విద్యార్థులు ఏ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధిస్తే, వాటినే పరిగణనలోకి తీసుకొంటారు. ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షలు నిర్వహించినా.. విద్యార్థులు రెండు సార్లూ పరీక్షలకు హాజరవ్వడం తప్పనిసరికాదు. జేఈఈ మాదిరిగా 10, 12 తరగతుల విద్యార్థులు కూడా బోర్డు పరీక్షలకు రెండుసార్లు హాజరవ్వొచ్చు. ఇది పూర్తిగా విద్యార్థుల ఛాయిస్. అలాగే ఇలా ఏడాదికి రెండుసార్లు బోర్డు పరీక్షల నిర్వహించడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. సీబీఎస్ఈ పది, పన్నెండో తరగతి పరీక్షలను ప్రస్తుతం ఫిబ్రవరి-మార్చిలో నిర్వహించి మేలో ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఫెయిలైన విద్యార్థులకు జూలైలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లోనే ఏదైనా ఒక సబ్జెక్ట్‌లో తమ మార్కులను మెరుగుపర్చుకోవడానికి పాసైన విద్యార్థులకూ అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ విధానం అమలులో ఉంది. అయితే తాజా విధానం అమల్లోకి వస్తే రెండు బోర్డు పరీక్షల మధ్య నిర్ణీత కాల వ్యవధి ఉంటుంది. అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) ప్రవేశాలపై దీని ప్రభావం ఏ మాత్రం పడకుండా నూతన విద్యా క్యాలెండర్‌ను రూపొందించే అవకాశం ఉంది. దీంతో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవడానికి తగిన సమయం లభిస్తుంది. ఏడాదికి 2 సార్లు బోర్డు పరీక్షలు నిర్వహించే విధానం 2026 నుంచి అమలు చేసేందుకు కేంద్రం ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది.

# హైదరాబాద్‌లో ప్రపంచ సుందరి పోటీలపై వివాదం

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు :**
గతంలో కూడా భారత్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరిగాయ్. 1996, 2024లో ముంబై వేదికగా ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించారు. ఇప్పుడు మూడోసారి మిస్‌వరల్డ్ పోటీల కు ఆతిత్యమిస్తోంది భారత్. అయితే, ఈసారి దుబాయ్‌తో పోటీపడి మరీ అవకాశం దక్కించుకుంది తెలంగాణ. తెలంగాణ వేదికగా 72వ మిస్‌వరల్డ్ పోటీలను నిర్వహిం చనుండటం చాలా ఆనందంగా ఉందన్నారు తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా ఉన్న గుర్తింపు.. చారిత్రక, ప్రత్యేక గ్రామీణ నేపథ్యంతోనే హైదరాబాద్‌కి ఈ అవ కాశం దక్కిందన్నారు8 నుంచి 9ఈవెంట్స్‌గా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తారు. తెలంగాణ పర్యాటకశాఖతో కలిసి ప్రపంచ సుందరి పోటీలను నిర్వహిస్తోంది మిస్ వరల్డ్ సంస్థ. ఈ పోటీల కోసం 10వేదికలను పరిశీలిస్తున్నారు. ప్రారంభ ముగింపు వేడుకలు, గ్రాండ్ ఫినాలేను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. అయితే, మిగతా ఈవెంట్స్ కోసం రామప్ప, యాదాద్రి, లక్నవరం, అనంత గిరి వంటి ప్రాంతాలు ఉండటం వివాదాస్పదమవుతోంది. ఆధ్యాత్మిక కేంద్రాల్లో అందాల పోటీలను ఎలా నిర్వహిస్తా రంటోంది వీహెచ్‌పీ. బికినీలతో అందాలు ఆరబోసే విదేశీ విష సంస్కృతి తమకొద్దు అంటున్నారు ఎఊఖ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్. రామప్ప, యాదాద్రి, అనంతగిరి లాంటి ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఇలాంటి వికృత పోటీలకు అనుమతి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీలకు ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం రద్దు చేయాలని.. లేదంటే అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. జాతీయ అధికార ప్రతినిధి శశిధర్‌కేవలం, ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించడమే కాదు.. తెలంగాణలో పర్యాటకాన్ని ఎంకరేజ్ చేయడం, పేదరిక నిర్మూలన కోసం కూడా పనిచేయనుంది మిస్‌వరల్డ్ సంస్థ. ఎంతో శ్రమించి ప్రపంచ సుందరి పోటీలను తెలంగాణకు తీసుకొస్తున్నట్టు చెప్పింది ఆ సంస్థ.

# పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించండి

**జగిత్యాల, తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణ పెన్షనర్ల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావును టీ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో కలిసి పెండింగ్ బిల్లులు మంజూరు లో తీవ్రమైన ఆలస్యం జరగడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే 2024 మార్చి నుంచి రిటైర్ అయిన వారికి జీ.పి.ఎఫ్, గ్రాట్యుటీ,కమ్యూటేషన్,లీవ్ సాలరీ తదితర ప్రయోజనాల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాల్సిందిగా కోరడం జరిగిందని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ అన్నారు..గురువారం జిల్లా కేంద్రంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తమ అసోసియేషన్ సభ్యులుగా ఉండి మరణించిన వారి కుటుంబ సభ్యులకు హరి ఆశోక్ కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం హైదరాబాద్‌లో ఆర్థిక శాఖ కార్యదర్శిని కలువగా స్పందిస్తూ దశల వారీగా ఉద్యోగుల పెండింగ్ బిల్లులు అన్నింటిని మంజూరు చేస్తామని ,ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక , తప్పకుండా అంశాల వారీగా బిల్లులను చెల్లిస్తామని టీపెన్షనర్ల రాష్ట్ర నాయకులకు ఆర్థిక శాఖ కార్యదర్శి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వ నాథం, సహాయ అధ్యక్షుడు పి.హన్మంత రెడ్డి,ఉపాధ్యక్షులు వెల్మల ప్రకాష్ రావు, ఎం.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల ఆశోక్ రావు,, కే.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

## దశ దిశలా....ఢిల్లీ అభివృద్ధి

**న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు :**
ఢిల్లీ సిఎంగా రేఖాగుప్త నియామకంపై హైదరాబాద్‌లో ఎంపీ.డికె.అరుణ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసారు. ప్రధాని మోది మరోసారి నారీశక్తిని గుర్తించారు. ఢిల్లీ మహిళా సిఎంగా రేఖాగుప్త రిని ఎన్నుకోవడం సంతోషకరమని అన్నారు. బీజేపీ హయంలో.. రేఖా రి సారథ్యంలో హస్తిన మరింత అభివృద్ధి కాబోతోంది. గత పదేళ్ల ఆప్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఆ సమస్యలు, బాధలన్నీ తీర్చే దిశగా ఢిల్లీలో బీజేపీ పాలన చేయనుంది. ఢిల్లీ నూతన సిఎం రేఖాగుప్త కి ప్రత్యేక అభినందనలు. దేశ రాజధానిలో సిఎంగా మహిళానేతకు అవకాశం కల్పించిన ప్రధాని మోడీ, , అధ్యక్షుడు నడ్డా కి ప్రత్యేక కృతజ్ఞతలని అన్నారు. మాట తప్పం.. మడమ తిప్పం. ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని తూచ తప్పకుండా అమలు చేస్తాం. మోడీ గ్యారంటీకి తిరుగులేదు.. అభివృద్ధి ఆగేది లేదని అన్నారు.

# భారత్‌లో 30శాతానికి పైగా తగ్గిన ఆత్మహత్యల మరణాల రేటు

**న్యూఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు :**
భారతదేశంలో ఆత్మహత్యల మరణాల రేటు 30 శాతానికి పైగా తగ్గిందని ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్ అధ్యయనం తాజాగా వెల్లడించింది. ఆత్మహత్య మరణాల రేటు 1990లో లక్ష జనాభాకు 18.9గా ఉండేదని పేర్కొంది. అయితే 2019లో అది లక్ష జనాభాకు 13.1 శాతానికి, 2021లో లక్ష జనాభాకు 13 శాతానికి పడిపోయినట్లు వెల్లడించింది. 1990 నుంచి 2021 వరకూ భారత్‌లో ఆత్మహత్యల మరణాల రేటు 31.5 శాతానికి తగ్గినట్లు పేర్కొంది. లాన్సెట్ అధ్యయనం ప్రకారం.. ఆత్మహత్యల ద్వారా మరణాల రేటు తగ్గడం మగవారి కంటే ఆడవారిలోనే ఎక్కువగా కనిపించింది. 1990లో స్త్రీలలో ఆత్మహత్య మరణాల రేటు లక్ష జనాభాకు 16.8 శాతంగా ఉండగా.. అది 2021లో లక్ష జనాభాకు 10.3 శాతానికి తగ్గింది. ఇక 1990లో పురుషుల ఆత్మహత్యల రేటు లక్ష జనాభాకు 20.9 శాతంగా ఉంది. 2021 నాటికి అది లక్ష జనాభాకు 15.7కు తగ్గింది. '2020లో భారతదేశంలో అత్యధిక ఆత్మహత్యల మరణాల రేటు విద్యావంతులైన మహిళల్లోనే కనిపించింది. ఇందుకు కారణం కుటుంబ సమస్యలే' అని యూఎస్ వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టి ట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ పరిశోధకులు తెలిపారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 740,000 ఆత్మహత్యలు నమోద వుతున్నాయి. అంటే సగటున ప్రతి 43 సెకన్లకు ఒకరు సూసైడ్ చేసుకుంటు న్నారన్న మాట. గత మూడు దశాబ్దాల్లో వయస్సు- ప్రామాణిక మరణాల రేటు దాదాపు 40శాతానికి తగ్గింది. లక్ష జనాభాకు 15మరణాల నుంచి లక్ష జనాభాకు 9మరణాలకు చేరింది. ఇందులో ఆడవారిలో మరణాల రేటు 50 శాతానికి క్షీణించగా.. పురుషుల్లో 34శాతానికి తగ్గింది. మొత్తం మీద ఆత్మహత్యల మరణాల రేటు మగవారిలో లక్ష జనాభాకు 12.8 శాతంగా, స్త్రీలలో లక్షజనాభాకు 5.4

# నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి




**సిద్ధిపేట, తెలంగాణ ముచ్చట్లు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన సంవత్సర కాలంలో నిరుద్యోగులకు 55 వేలకు పైగా ఉద్యోగాలను అందించి వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలబడ్డామని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో గ్రాడ్యుయేషన్ ఎన్నికల సందర్భంగా సిద్ధిపేట పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ బిజెపి చీకటి స్నేహం బయటపడిందని బిజెపిని గెలిపించేందుకే బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి మద్దతు ఇచ్చేందుకు బిఆర్ఎస్ కుట్ర పన్నిందని అన్నారు. మద్దతు ఇచ్చినందుకు కేసీఆర్ కుమార్తె కవిత జైలు శిక్ష పడకుండా ఉండేందుకు లిక్కర్ కేసు కొట్టివేసేలా ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ప్రజలకు ఎన్ని మాయమాటలు చెప్పిన మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎన్నికల ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించుకొని రాష్ట్ర సంక్షేమానికి పాటుపడాలని అన్నారు. ఈనెల 22న సిద్ధిపేటలో ఎమ్మెల్సీ ఎన్నికల సభ ఉంటుందని ఆ సభకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఇతరులు చాలామంది వస్తారని అన్నారు. మొదటి ప్రాధాన్యతగా నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమం సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, కాలీముద్దీన్, వాహిద్ ఖాన్, దాస అంజయ్య,వాహబ్,సార్, గోపి కృష్ణ, గాయశుద్దీన్, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్,బంగారం. శ్రీనివాస్, అరబోలు రాజి రెడ్డి కేమ్మ సారం రాజేష్ ఖన్నా, సాయి ప్రతాప్,కుమార స్వామి,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి




**భద్రాద్రి జిల్లా, తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి విద్యారంగానికి కనీసం ఓ ప్రత్యేక శాఖను నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేసి కేసిఆర్ అడుగు జాడల్లోనే రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నాడని పిడి యస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ విమర్శించారు. గురువారం భద్రాచలం జూనియర్ కళాశాల విద్యార్థులు పిడియస్ యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పిడియస్‌యూ భద్రా చలం డివిజన్ కార్యదర్శి మునిగల శివప్రశాంత్ అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయిందని ఎటువంటి పట్టింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుం టున్నది అని కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఒకపక్క గురుకుల విద్యాలయాలలో ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు మరణిస్తుంటే మరోపక్క ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో అరకొర సౌకర్యాలు, అధ్యాప కుల లేమి, మంచినీరు సమస్య, సరిపోనీ తరగతి గదులు, శిథిలావస్థలో బిల్డింగులు, అద్య భవనాల్లో విద్యాసంస్థల నిర్వహణ లాంటి లోపాలతో ప్రభుత్వ విద్యా సంస్థలు కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వ చేయూత ఏమాత్రం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ విద్యాసంస్థల నిర్వహణకు ఉద్యోగుల జీతపత్యాలకు కూడా సరిపోని స్థితి ఉన్నదని ఈ సందర్భంలో ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కొత్త సీసాలో పాత సార చందంగా విద్యార్థులకు పాత సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు తోడై స్వాగతం పలుకుతున్నాయని అన్నారు. అంతేకాకుండా సంవత్సరాల తరబడి స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయకుండా వేల కోట్ల రూపాయలను పెండింగ్ లో ఉంచి విద్యార్థులకు మొండి చేయి చూపిస్తున్నారని తెలిపారు. విద్యారంగంలో కొంతమేరకైనా సమస్యలు పరిష్కరించబడాలి అంటే కొఠారి కమిషన్ సూచించిన మేరకు రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం పట్ల చిత్తశుద్ధి చాటుకో వాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల నూతన ముసాయి దాను ప్రవేశపెట్టి వీసీల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే వ్యక్తులను వైస్ ఛాన్సలర్‌గా నియమించి విశ్వవిద్యాలయాలలో హిందుత్వ ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు కుట్రలో భాగంగానే నూతన ముసాయిదాను తీసుకొచ్చిందని దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఖండించి చేతులు దులుపు కోవడం కాకుండా అడ్డుకోవాలని వారు సూచిం చారు. అమెరికాలో భారత విద్యార్థులపై ట్రంప్ దుశ్చర్యలను ఖండించాలని,

భారత పౌరుల చేతు లకు సంకెళ్లు వేసి అవమానపరుస్తుంటే దేశ ప్రధాని మోడీ ఎందుకు నోరు తెరవడం లేదని వారు ప్రశ్నించారు. భారత పౌరులు అవమానానికి గురికా కుండా గౌరవంగా దేశానికి తరలించే చర్యలు చేపట్టాలని మోడీని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని,విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్వహి స్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి మునిగెల శివ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# సుందర్ రాజ్ యాదవ్‌కు పెరుగుతున్న మద్దతు



**హనుమకొండ తెలంగాణ ముచ్చట్లు :** ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎక్కడికి వెళ్లిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. వారి అభిమానం, మాటలు వింటుంటే గెలుపుపై వంద శాతం ధీమా వచ్చింది.. దమ్మున్న లీడర్ వచ్చిందని, ఇన్నాళ్లు ఎవరెవరి కోసమో పని చేశామని, ఇప్పుడు మా కోసం కొట్లాడే మీ కోసం తప్పకుండా పని చేస్తామని , కడుపులో పెట్టుకొని గెలిపించుకుంటామని భరోసా ఇస్తున్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏస్. సుందర్ రాజ్ యాదవ్ చెప్పారు. తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీజీఏఆర్ఐఈఏ) ఆయనకు సంపూర్ణ మద్దతు తెలుపారు. ఈ మేరకు సుందర్ రాజ్ యాదవ్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. ఉమ్మడి మూడు జిల్లాల్లో చేస్తున్న తన ప్రచారానికి ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు.మా సమస్యలపై కొట్లాడేందుకు అడుగు వేసిన మీరు.. మండలికి వెళ్లాల్సిందేనని చెబుతున్నారన్నారు. విద్యావ్యవస్థ ఇబ్బందుల్లో ఉందని, వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. గురుకుల్లో పని చేసే అధ్యాపకులకు 010 అకౌంట్ ద్వారా వేతనాలు వచ్చేలా చూస్తానని తెలిపారు. టీచర్ల ఇతర పనులతో సతమతమవుతున్నారని, వారు ప్రశాంతంగా విద్య చెప్పేలా వారి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. గురుకులాల్లో నెలకొన్న అన్ని సమస్యలు నెరవేరుస్తానని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు కోసం పోరాడుతానని, మెరుగైన పెన్షన్ స్కీం వచ్చేలా పోరాడుతానని చెప్పారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏస్.సుందర్ రాజ్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఇనిస్టి ట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీజీఏఆర్ఐ ఈఏ) అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ కు తమ టీజీఏఆర్ఐఈఏ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రకటించారు. సుందర్ రాజ్ యాదవ్ మండలిలో ఉండే తామే ఉన్నట్లుగా భావిస్తామని, ఆయన పని తీరుపై మాకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. గతంలో తాము ఉపాధ్యాయ సంఘాల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన వారికి మద్దతు ఇచ్చామని, వారు గెలిచిన అనంతరం తమ సమస్యలపై ఏన్నాడూ నోరు మెదపలేదన్నారు. విద్యావేత్త, స్కూళ్ల అధినేత అయిన సుందర్ రాజ్ యాదవ్ తమ సమస్యలపై నిక్కచ్చిగా కొట్లాడుతారనే నమ్మకంతో ఆయనకు రానున్న ఎన్నికల్లో మద్దతు ఇస్తున్నామని, ఇది రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అందరి మాట అని చెప్పారు. గురుకులాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, గురుకులాల టీచర్లు పని ఒత్తిడి, వేతనాలు సరిగాలేక సతమతమవుతున్నారని, వీటి పరిష్కారానికి మండలిలో కొట్లాడే నాయకుడిగా సుందర్ రాజ్ యాదవ్ ను పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో (టీజీఏఆర్ఐఈఏ) ప్రధాన కార్యదర్శి ఎస్. గణేష్, ఆనంద్, షైన్ కుమార్ యాదవ్, పలు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్చిలో కేయూలో జాతీయ సెమినార్



**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో ఆధ్వర్యంలో మార్చి 21, 22 తేదీలలో "భారతీయ సమాజంలో సంకీర్ణ రాజకీయాలు మరియు సామాజిక పరిస్థితి"అనే అంశంపై జరిగే జాతీయ సెమినార్ ప్రారంభ సమావేశానికి ముఖ్య ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్‌ని ఆహ్వానించినట్లు కె.యు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. గురువారం హైదరాబాదులో ప్రొఫెసర్ జి.హరగోపాల్ వద్దకు వెళ్లి ఆహ్వాన బ్రోచర్ అందజేశారు. ప్రొఫెసర్ జి.హర గోపాల్ తప్పకుండా జాతీయ సెమినార్‌కు హాజరవుతానని అన్నారని డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ , డాక్టర్ వాడపల్లి నాగరాజు , రీసెర్చ్ స్కాలర్స్ అంకెళ్ల శంకర్ , కలిపికొండ వినోద్ తదితరులు ఉన్నారు.

# పులి సరోత్తం రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

**వర్ధన్నపేట,తెలంగాణ ముచ్చట్లు**
నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా బిజెపి బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధా న్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ వర్ధన్నపేట మండలం కట్ర్యాల చంద్రు తండా ఇల్లంద గ్రామాల్లో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ముఖ్యఅతిథిగా బిజెపి వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ హర్షణపల్లి రాంభూపాల్ పాల్గొని ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ఓటుఅభ్యర్థించారు.

# ఫ్లాట్లను కొనుగోలు చేసే అవకాశం కనిపించడం లేదు



**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కొంత కుదుపుకు లోనవుతుంది. కొనేవారు లేక అనేక వెంచర్లు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. గతంలో వెంచర్ ప్రారంభానికి ముందే అడ్వాన్స్ బుకింగ్‌తో మొత్తం అమ్ముడుపోయేవని, ఇప్పుడు ప్రీ బుకింగ్స్ లేకపోగా నిర్మాణాలు కూడా పూర్తయిన ఫ్లాట్లను కొనుగోలు చేసే అవకాశం కనిపించడం లేదని రియల్ ఎస్టేట్ రంగం నిపుణులు చెబుతున్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయిందా? హైడ్రా దెబ్బకు హడలెత్తిపోయి కొనుగోలు చేయడం లేదా? అన్నది స్పష్టత లేకపోయినా కొనుగోళ్లు తగ్గిపోవడంతో కొందరు బిల్డర్లు బలవన్మరణానికి కూడా పాల్పడుతున్నారు. ఇలా హైదరాబాద్ నగరంలో అనేక వెంచర్లు కొనేవారు లేక వెలవెల బోతున్నాయి. ముందుగా నిర్మాణాలు పూర్తయిన కొన్ని ప్రముఖ సంస్థలు ఆఫర్లు కూడా భారీగానే ప్రకటిస్తున్నాయి. ఇంటీరియర్ ఫ్రీ అంటున్నాయి. మాడ్యులర్ కిచెన్ ఫ్రీగా చేస్తామని చెబుతున్నాయి. పార్కింగ్ ఉచితం అని చెబుతున్నారు. కొన్ని నిర్మాణ సంస్థలయితే రిజిస్ట్రేషన్ ఫీజులో కూడా రాయితీలను ప్రకటిస్తున్నాయి. అయినా కొనేనాథుడే కరువయ్యారు. మరొకవైపు ఎన్ఆర్ఐలు ఎక్కువగా పెట్టుబడి పెట్టేవారు. అక్కడ ఉండి ఇక్కడ ఆస్తులను కొనుగోలు చేసేవారు. కానీ వారు కూడా హైడ్రా నిబంధనలు ఎంత మేరకు అప్లయ్ అవుతాయో? ఏ బిల్డర్‌ను నమ్మాలన్నది తెలియక కొనడం మానేశారు. దీంతో వారి సొంత ఊళ్లలో వ్యవసాయ భూమి కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతు న్నారు. ఇక కొనడం కష్టమే మూడు నెలల్లో... మరోవైపు కొత్తగా ఉద్యోగాలు సంపాదించుకుని అమెరికాలో స్థిరపడిన వారు కూడా ఎక్కువ మంది కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చేవారు. అమెరికా వెళ్లి సంపాదన మొదలవ్వగానే హైదరాబాద్‌లో సొంత ఇంటిని కొనుగోలు చేయడం ఒక అలవాటుగా మార్చుకునే వారు. కానీ ఇప్పుడు ట్రంప్ రాకతో ఉన్న ఉద్యోగాలు ఊడిపోయే పరిస్థితి వచ్చింది. పార్ట్ టైం ఉద్యోగాలు కూడా వచ్చే అవ కాశం కనిపించడం లేదు. దీంతో అటువంటి వారు కూడా కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో హైదరాబాద్‌లో 22శాతం ఇళ్ల అమ్మకాలు పడిపోయాయి. గత మూడు నెలల్లో అమ్ముడు పోయింది కేవల పదహారు వేలు మాత్రమేనట. ఒక్క ఏడాదిలోనే ఐదు వేల యూనిట్లు తగ్గాయని క్రెడాయ్-సీఆర్ఈ మ్యాట్రిక్స్ నివేదిక వెల్లబించింది. కొత్త ప్రాజెక్టుల ప్రారంభం కూడా నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్లు కూడా తగ్గడం ఇందుకు నిదర్శనం.

# తెరపైకి బుక్ ట్రెండ్స్..

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
ఏపీలో రెడ్ బుక్, తెలంగాణలో పింక్ బుక్, ఇప్పుడు కాషాయ బుక్.. తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా పొలిటికల్ బుక్స్ ట్రెండ్..ఉండేది ఐదేళ్లే అన్నారు ఈటల రాజేందర్. తాము కాషాయ బుక్ ను మెయింటేన్ చేస్తున్నామని, తమను ఇబ్బంది పెడుతున్న వారికి కచ్చితంగా తగిన పరిణామాలు ఉంటాయని ఈటల హెచ్చరించారు.టీడీపీ నేత నారా లోకేశ్ రెడ్ బుక్ తో ఏపీలో మొదలైన ఈ అపోజిషన్ బుక్ ట్రెండ్.. ఇప్పుడు తెలంగాణలో ఎంట్రీ ఇచ్చింది. పింక్ బుక్ రెడీ చేస్తామని ఇటీవలే కవిత ప్రకటన చేశారు. తాజాగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. కాషాయ బుక్ ను తెరపైకి తెచ్చారు. తాము కాషాయ బుక్ ను మెయింటేన్ చేస్తున్నామని, తమను ఇబ్బంది పెడుతున్న వారికి కచ్చితంగా తగిన పరిణామాలు ఉంటాయని ఈటల హెచ్చరించారు.ప్రభుత్వాలు ఉండేది ఐదేళ్లే అన్నారు ఈటల రాజేందర్. అయితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండేది 35 ఏళ్లు అని ఈటల చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో ఎంతోమంది ఉద్దండులను తాము చూశామన్నారు. ఐఏఎస్ లు బానిసల్లా పని చేయొద్దని, గతంలో అలా పని చేసిన వారు జైలు పాలయ్యారని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని నడిపే నాయకుడికి అనుగుణంగా పనితీరు ఉంటుందని, సీఎంతో పాటు వారి బంధు మిత్రుల ఒత్తిడికి తలొగ్గదని ఆయన సూచించారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ జిల్లాలో ఈటల పర్యటించారు. మీడియాతో మాట్లాడిన ఈటల.. ఐఏఎస్, ఐపీఎస్ లను ఉద్దేశించి వార్నింగ్ ఇచ్చారు. అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. బాసుల ఆదేశాలు పాటించడం కాకుండా నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు.లేదంటే శ్రీలక్ష్మి సహా కొందరు అధికారులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. మేము కూడా ఆరెంజ్ బుక్ మెయింటేన్ చేస్తున్నామన్నారు. ఆ బుక్‌లో అందరి పేర్లు రాసుకుంటున్నామన్న ఈటల.. సమయం వచ్చినప్పుడు లెక్కలతో సహా బయటపెడతామని వార్నింగ్ ఇచ్చారు ఈటల. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు.అటు బీఆర్ఎస్ నేత కవిత సైతం పింక్ బుక్ అంటూ కలకలం రేపారు. తమ పార్టీ నేతలను, కార్యకర్తలను వేధిస్తున్నారని వదిలేది లేదన్నారు. తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులు, సీఎం రేవంత్ రెడ్డి అరాచకాలను పింక్ బుక్ లో నోటు చేస్తున్నామన్నారు కవిత. వచ్చేది తమ ప్రభుత్వమే అన్న కవిత.. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడిన నేతలు, అధికారులకు బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు

# మనోడు కాకపోయినా మెచ్చుకోవాల్సిందే..



తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ :

బంగ్లాదేశ్ బ్యాటర్ తౌహిద్ హృదయ్ ఫెంటాస్టిక్ నాక్‌తో అలరించాడు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తౌహిద్ సూపర్ సెంచరీతో మెరిశాడు. అతడి ఇన్నింగ్స్ ఎప్పటికీ గుర్తుండిపోతుందనే చెప్పాలి. బంగ్లాదేశ్ బ్యాటర్ తౌహిద్ హృదయ్ క్రికెట్ లవర్స్ మనసులు గెలుచుకున్నాడు. దుబాయ్ వేదికగా టీమిండియాతో జరుగుతున్న మ్యాచ్‌లో అతడు సూపర్ సెంచరీతో మెరిశాడు. చాంపియన్స్ ట్రోఫీ లాంటి బడా టోర్నమెంట్, ఎదురుగా భారత్ లాంటి టాప్ టీమ్, 35 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన టైమ్‌లో అతడి నుంచి వచ్చిన ఈ ఇన్నింగ్స్ ఎప్పటికీ గుర్తుండిపోతుందనే చెప్పాలి. 114 బంతుల్లో 100 పరుగులతో అదరగొట్టాడు హృదయ్. బౌండరీలు, సిక్సుల జోలికి ఎక్కువగా పోకుండా కామ్‌గా, కూల్‌గా బ్యాటింగ్ చేశాడు. టీమ్‌ను ఆపద నుంచి బయటపడేయడానికి హృదయ్ ఆఖరి వరకు ప్రయత్నించాడు. అతడితో పాటు జేకర్ అలీ (114 బంతుల్లో 68) కూడా చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. బంతులతో నిప్పులు చెరుగుతున్న భారత బౌలర్లను తట్టుకొని సింగిల్స్, డబుల్స్‌తో బండి నడిపించారు. వికెట్లకు గోడ కట్టేశారు. జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించడమే లక్ష్యంగా బ్యాటింగ్ చేశారు. ఇద్దరూ కలిసి 10 బౌండరీలు, 2 సిక్సులు మాత్రమే కొట్టారు. స్ట్రైక్ రొటేషన్‌తో భారత బౌలర్లను విసిగించారు. అలీ ఔట్ అయినా తౌహిద్ మాత్రం ఆఖరి వరకు పట్టువిడవకుండా క్రీజులో నాటౌట్‌గా నిలబడ్డాడు. అందుకే ప్రత్యర్థి ఆటగాడు అయినా సరే అతడి పట్టుదల, తెగింపును మెచ్చుకోవాల్సిందే. కాగా, బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. మరి.. కష్టసాధ్యం కాని లక్ష్యాన్ని భారత్ ఎలా అందుకుంటుందో చూడాలి.

## సారీ చెప్పిన రోహిత్..





తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ :

భారత కెప్టెన్ రోహిత్ శర్మ క్షమాపణలు చెప్పాడు. సారీ అంటూ చేతులు జోడించి వేడుకున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్-బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి మ్యాచ్‌లో ఇది చోటుచేసుకుంది. హిట్‌మ్యాన్ సారీ చెప్పింది మరెవరికో కాదు.. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కే. బంగ్లా బ్యాటింగ్ సమయంలో అక్షర్ వరుసగా రెండు బంతుల్లో 2 వికెట్లతో జోరు మీదున్నాడు. 9వ ఓవర్‌లో తంజిద్ హసన్ (25), ముష్ఫికర్ రహీం (0)ను బ్యాక్ టు బ్యాక్ పెవిలియన్‌కు పంపించాడు అక్షర్. ఆ తర్వాతి బంతికి జేకర్ అలీని కూడా దాదాపుగా ఔట్ చేయబోయాడు. అయితే రోహిత్ తప్పిదంతో హ్యాట్రిక్ మిస్ చేసుకున్నాడు అక్షర్. జేకర్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్స్‌లో నిల్చున్న రోహిత్ జారవిడిచాడు. చేతుల్లోకి వచ్చిన క్యాచ్‌ను నేలపాలు చేశాడు. ఈజీ క్యాచ్‌ను వదిలేయడంతో టీమ్ ఆటగాళ్లంతా నిరాశలో కూరుకుపోయారు. హిట్‌మ్యాన్ కూడా కోపం తట్టుకోలేకపోయాడు. తప్పు చేశానంటూ నేలను గట్టిగా కొట్టాడు. అనంతరం ఎలాగోలా సంభాళించుకున్నాడు. హ్యాట్రిక్ వచ్చేసిందని ఎంతో ఆశగా చూసిన అక్షర్ నిరాశలో కూరుకుపోవడంతో అతడికి సారీ చెప్పాడు రోహిత్. చేతులు జోడించి అతడి వైపు చూస్తూ క్షమాపణలు చెప్పాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, బంగ్లాదేశ్ ప్రస్తుతం 21.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 84 పరుగులతో ఉంది. జేకర్ అలీ (24 నాటౌట్), తౌహిద్ హృదయ్ (26 నాటౌట్) ఇప్పుడు క్రీజులో ఉన్నారు.



## క్రికెట్ అభిమానులకు రోహిత్ శర్మ సందేశం..

తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ :

చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇవాళ బంగ్లాదేశ్‌తో ఇండియా ఆడనున్నది. అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ వీడియోను బీసీసీఐ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. భారతీయ క్రికెట్ అభిమానులకు రోహిత్ ఓ అపీల చేశారు. ఎప్పటి తరహాలోనే టీమిండియాకు మద్దతు ఇవ్వాలని కోరారు. చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. బార్బడోస్ నుంచి తమను చాంపియన్లుగా చూస్తున్నారని, మన దేశాన్ని, జట్టును, చాంపియన్‌గా మార్చేందుకు .. మీరు మాతో ఉండాలని రోహిత్ ఆ వీడియోలో పేర్కొన్నారు. మనం అందరం చాంపియన్లు అవుదామన్నారు. బార్బడోస్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌ను ఇండియా గెలిచిన విషయం తెలిసిందే.

## ప్లేయింగ్ 11లో వాళ్లకు చాన్స్ ఇవ్వని రోహిత్

తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ :



చాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత ప్రయాణం మొదలైంది. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది రోహిత్ సేన. ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన బంగ్లా తొలుత బ్యాటింగ్ చేయాలని డిసైడ్ అయింది. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ వైవిధ్యమైన ప్లేయింగ్ ఎలెవన్‌తో వెళ్లడం చాలా మందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ ఓపెనర్లుగా టీమ్‌లో ఉండటం కామనే. ఆ తర్వాత విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా మిడిలార్డర్ బాధ్యతలు చూసుకోవడం ఊహించిందే. స్పిన్ ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఎంపిక కూడా గెస్ చేసినవే. కానీ చివరి ముగ్గురు ఆటగాళ్ల ఎంపికలో టీమ్ మేనేజ్‌మెంట్ ట్విస్ట్ ఇచ్చింది. భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో అనూహ్యంగా యంగ్ పేసర్ హర్షిత్ రాణా చోటు దక్కించుకున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో చాన్నాళ్లుగా రాణిస్తూ వస్తున్న లెఫ్టార్మ్ సీమర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులో తప్పక ఉంటాడని అంతా భావించారు. ఎడమచేతి వాటం పేసర్ కాబట్టి కూర్పులో వైవిధ్యం ఉంటుందని అనుకున్నారు. కానీ అతడ్ని కాదని యువ బౌలర్ రాణాను తీసుకున్నారు. రాణా వస్తే షమి ఉండడని అనుకుంటే అతడికి కూడా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు కల్పించింది టీమ్ మేనేజ్‌మెంట్. ప్రధాన స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తిని తీసుకోవడం పక్కా అని వార్తలు వచ్చాయి. అయితే సారథి రోహిత్ బాగా నమ్మే కుల్దీప్ యాదవ్ ప్లేయింగ్ 11లోకి ఎంట్రీ ఇచ్చాడు. మొత్తంగా ఒక స్పిన్నర్, ఇద్దరు పేసర్లు, ముగ్గురు ఆల్‌రౌండర్లు, ఐదురుగు బ్యాటర్లతో కాస్త ప్రత్యేకమైన కూర్పుతోనే బరిలోకి దిగింది భారత్. ఈ లైనప్ ఎంతవరకు సక్సెస్ అవుతుందో చూడాలి.



## పాక్‌కు కోలుకోలేని షాక్..

తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ :

చాన్నాళ్ల తర్వాత చాంపియన్స్ ట్రోఫీ రూపంలో మెగా టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్‌కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. టోర్నీ ఆరంభానికి ముందే భారత జెండా ప్రదర్శన విషయంలో విమర్శలపాలైంది దాయాది. ఆ తర్వాత ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఘోరంగా ఓటమిపాలైంది. న్యూజిలాండ్‌తో జరిగిన టోర్నీ ఓపెనర్‌లో 60 పరుగుల తేడాతో చిత్తయింది రిజ్వాన్ సేన. దీంతో పోటీలో నిలవాలంటే తదుపరి భారత్‌తో జరిగే మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితి. ఈ తరుణంలో ఆ టీమ్‌కు ఊహించని రీతిలో ఎదురుదెబ్బ తగిలింది. అసలు ఏం జరిగిందో ఇప్పుడు చూద్దాం.. సింగిల్ హ్యాండ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చే సత్తా ఉన్న పాక్ స్టార్ బ్యాటర్ ఫఖర్ జమాన్ మొత్తం చాంపియన్స్ ట్రోఫీకి దూరమైనట్లు సమాచారం. గాయం కారణంగా న్యూజిలాండ్‌తో మ్యాచ్ మధ్యలో నుంచి తప్పుకున్న అతడు.. బ్యాటింగ్ టైమ్‌లో మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. ఇంజ్యూరీ ఇంకా నయం కాకపోవడంతో పూర్తి టోర్నమెంట్‌కు దూరమయ్యాడని వినిపిస్తోంది. టీమిండియాతో ఫిబ్రవరి 23వ తేదీన జరిగే తదుపరి మ్యాచ్‌లో అతడు ఆడబోవట్లేదని పాక్ క్రికెట్ వర్గాల సమాచారం. జమాన్ దుబాయ్ ఫ్లైట్ ఎక్కడం లేదని రూమర్స్ వస్తున్నాయి. అతడి గాయం తీవ్రతపై పాక్ బోర్డు కొంత స్పష్టత ఇచ్చింది. అతడ్ని వైద్య పరీక్షల కోసం తరలిస్తున్నామని, త్వరలోనే పూర్తి అప్‌డేట్ ఇస్తామని చెప్పుకొచ్చింది. కానీ దుబాయ్ విమానం ఎక్కుతాడా? లేదా? అనేది మాత్రం పేర్కొనలేదు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో పూర్తి స్థాయిలో ఫీల్డింగ్ చేయలేకపోయిన ఫఖర్ జమాన్.. బ్యాటింగ్ మాత్రం కంటిన్యూ చేశాడు. ఫోర్త్ డౌన్‌లో దిగిన స్టార్ బ్యాటర్ 41 బంతుల్లో 24 పరుగులు చేశాడు. మంచి స్టార్ట్ దొరికినా దాన్ని భారీ ఇన్నింగ్స్‌గా మలచలేకపోయాడు. ఆఖర్లో ఖుష్‌దిల్ షా (49 బంతుల్లో 69) అదరగొట్టినా.. మిగతా బ్యాటర్లు ఫెయిల్ అవడంతో పాక్‌కు భారీ ఓటమి తప్పలేదు. ఫఖర్ జమాన్ లాంటి అనుభవం కలిగిన ఆటగాడు దూరమవడం పాక్‌కు గట్టి ఎదురుదెబ్బే. టీమిండియాతో మ్యాచ్‌లో అతడు లేని లోటును దాయాది ఎలా భర్తీ చేస్తుందో చూడాలి.

## చరిత్ర సృష్టించిన మహమ్మద్ షమీ..




తెలంగాణ ముచ్చట్లు, స్పోర్ట్స్ :

భారత పేస్ బౌలర్ మహమ్మద్ షమీ చరిత్ర సృష్టించాడు. చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో బంగ్లా బ్యాటర్ జాకిర్ వికెట్ తీసి తన ఖాతాలో కొత్త రికార్డును వేసుకున్నాడు షమీ. వన్డేల్లో 200 వికెట్లు తీసిన స్పీడ్ బౌలర్ అయ్యాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 200 వికెట్లు తీసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. షమీ మొత్తం 5126 బంతులు వేసి తన ఖాతాలోకి 200వ వికెట్ వేసుకున్నాడు. అయితే ఆసీస్ బౌలర్ స్టార్క్ 200 వికెట్లు తీసుకోవడానికి 5240 బంతులు వేయాల్సి వచ్చింది. కానీ అతి తక్కువ మ్యాచుల్లో స్టార్క్ ఆ రికార్డును అందుకున్నాడు. టీ20 వరల్డ్‌కప్ తర్వాత గాయపడ్డ షమీ.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చాడు. జాకిర్ అలీ, తౌహిద్ హృదయ్.. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించారు. ఇండియాతో జరుగుతున్న మ్యాచ్‌లో.. ఓ దశలో బంగ్లాదేశ్ 35 రన్స్‌కే అయిదు వికెట్లు కోల్పోయింది. అయితే ఆ తర్వాత ఆరో వికెట్‌కు తౌహిద్, జాకిర్‌లు కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ ఇద్దరూ హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. ఆరో వికెట్‌కు 153 రన్స్ జోడించారు. షమీ బౌలింగ్‌లో జాకిర్ అలీ భారీ షాట్‌కు ప్రయత్నించి కోహ్లీకి క్యాచ్ ఇచ్చాడు. జాకిర్ అలీ వ్యక్తిగతంగా 68 రన్స్ చేసి ఔటయ్యాడు. బంగ్లా 46 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 రన్స్ చేసింది.

# ఇకపై మంచి సినిమాలు మాత్రమే చేస్తా..

తెలంగాణ ముచ్చట్లు, సినిమా

యువ కథానాయకుడు విశ్వక్ సేన్ తెలుగు సినిమా ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపాడు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఒక ప్రెస్ నోట్ విడుదల చేశాడు. ఇటీవల ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం లైలా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. విడుదలకు ముందే వివాదంలో చిక్కుకోవడం.. ఆ తర్వాత రిలీజ్ అయ్యాక అదే పాత రాడ్ కంటెంట్ అంటూ నెట్టింటా ట్రోల్ వచ్చాయి. దీంతో తాజాగా ఈ సినిమాకు సంబంధించి క్షమాపణలు తెలిపాడు. ఇకపై మంచి సినిమాలు మాత్రమే చేస్తానని తెలిపాడు. నమస్తే, ఇటీవల నా సినిమాలు అందరూ కోరుకున్న స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శను పూర్తిగా అంగీకరిస్తున్నాను. నన్ను నమ్మి, నా ప్రయాణాన్ని మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ నా అభిమానులకు, నాపై ఆశీర్వాదంగా నిలిచినవారికి హృదయపూర్వక క్షమాపణలు. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే, కానీ ఆ ప్రయత్నంలో మీ అభిప్రాయాలను నేను గౌరవిస్తున్నాను. ఇక పై, నా ప్రతి సినిమా క్లాస్ లేదా మాస్ అయినా సరే, అసభ్యత ఉండదు. నేను ఒక చెడు సినిమా తీస్తే, నన్ను విమర్శించే హక్కు పూర్తిగా మీకు ఉంది. ఎందుకంటే, నా ప్రయాణంలో ఎవ్వరూ లేని సమయంలో నన్ను ప్రేమతో ముందుకు నడిపించింది మీరు. నా కెరీర్ ప్రారంభం నుంచి నేను ఎంచుకున్న కథలను మీరు ఎంతగా ప్రేమించారో తెలుసు. ఇకపై కేవలం సినిమా మాత్రమే కాదు, నా ప్రతి సన్నివేశం కూడా మీ మనసుకు తగిలేలా ఉండాలని నిర్ణయించుకున్నాను. అంతే కాకుండా, నా మీద విశ్వాసం ఉంచిన ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్ అందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే, నా కథానాయకులు దర్శకులు, రచయితలు నా వెన్నెముకగా నిలిచి, నన్ను మలిచిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. త్వరలోనే మరొక బలమైన కథతో ముందుకు వస్తాను. నా మంచి, చెడు కాలాల్లో నన్ను నమ్మి నిలబెట్టుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ మద్దతు నాకు ఎంతో ప్రాముఖ్యం ఇట్లు మీ విశ్వక్ సేన్ అంటూ రాసుకోచ్చాడు.





## దృశ్యం 3' ఫిక్స్.. అధికారికంగా ప్రకటించిన మేకర్స్

తెలంగాణ ముచ్చట్లు, సినిమా

సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ఎన్ని సార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపించే సినిమాలు కొన్ని ఉంటాయి. అలాంటి చిత్రాల్లో టాప్‌లో ఉంటుంది దృశ్యం జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మలయాళం నుంచి వచ్చిన ఈ చిత్రం రెండు పార్టులుగా వచ్చి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ఫ్రాంచైజీ నుంచి మూడో పార్ట్ రాబోతుంది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. గతం ఎప్పుడూ మౌనంగా ఉండదు. దృశ్యం 3 ప్రాజెక్ట్ ఫిక్స్ అయ్యిందంటూ మోహన్ లాల్ రాసుకోచ్చాడు. దీంతో త్వరలోనే దృశ్యం 3 పట్టాలెక్కబోతున్నట్లు తెలుస్తుంది.మలయాళం వెర్షన్‌లో మోహన్ లాల్, మీనా నటించగా.. తెలుగు వెర్షన్‌లో వెంకటేశ్, మీనా, హిందీ వెర్షన్‌లో అజయ్ దేవ్‌గన్, శ్రియా శరన్ నటించారు. ఇక విడుదలైన అన్ని భాషల్లో దృశ్యం, దృశ్యం 2 సినిమాలు సూపర్ హిట్‌గా నిలిచాయి.

## ఓటీటీలోకి వచ్చేసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్.. సమ్మేళనం



తెలంగాణ ముచ్చట్లు, సినిమా :

ప్రముఖ తెలుగు ఓటీటీ ఈటీవీ విన్‌లోకి సరికొత్త యూత్‌ఫుల్ వెబ్ సిరీస్ వచ్చేసింది. ట్రయాంగిల్ లవ్ స్టోరీ కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ సమ్మేళనం సిరీస్ ఇవాల్టి ( ఈనెల 20వ తేదీ) నుంచి అందుబాటులోకి వచ్చేసింది. ప్రియా వడ్లమాని, గానాదిత్య, విఘ్నయ్ అభిషేక్ ప్రధాన పాత్రలో డైరెక్టర్ తరుణ్ మహాదేవ్ ఈ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. ప్రేమ, స్నేహం, బ్రేకప్ వంటి అంశాలు అందరి జీవితంలోనూ ఉంటాయి. దాన్నే కాన్సెప్ట్‌గా చేసుకుని డైరెక్టర్ తరుణ్ మహాదేవ్ దర్శకత్వంలో సునయనీ, సాకేత్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. కాలేజీ రోజుల్లో ఓ యువకుడు తన స్నేహితులతో కలిసి ఎంతో ఆనందంగా గడుపుతాడు. స్వచ్ఛమైన ప్రేమను పొందుతాడు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల స్నేహితులు అందరికీ ఆ యువకుడు దూరమవుతాడు. ఆ తర్వాత తన కాలేజీ డేస్‌లోని మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ ఒక పుస్తకం రాస్తాడు. దాని పేరే సమ్మేళనం. మరి ఆ పుసక్తం దూరమైన స్నేహితులను ఎలా ఒక్కటి చేసింది? అనే కాన్సెప్ట్‌తో ఈ వెబ్ సిరీస్ తెరకెక్కింది. ఫుల్ యూత్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ వెబ్ సిరీస్ తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది.

## ధీరుడి కథ అందరికీ చేరువ కావాలనే..

తెలంగాణ ముచ్చట్లు, సినిమా :

చిన్నా, పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారిని భావోద్వేగానికి గురి చేసిన చిత్రం 'ఛావా' శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా బాలీవుడ్ దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ చిత్రానికి దేశ వ్యాప్తంగా విపరీతమైన ఆదరణ లభిస్తుంది. ఆ పోరాట యోధుడి కథను ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా చూపించారు దర్శకుడు. మరాఠా సామ్రాజ్యాన్ని పరిపాలించిన రెండో పాలకుడి పాత్రలో విక్కీ కౌశల్ తన నటనకు ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ సినిమా దేశవ్యాప్తంగా అందరికీ మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో పలు రాష్ట్రాల ప్రభుత్వాలు దీనికి పన్ను మినహాయింపునిచ్చాయి.'ఛావా'కు మధ్యప్రదేశ్ ప్రభుత్వం తాజాగా పన్ను మినహాయింపును ప్రకటించింది. బుధవారం ఛత్రపతి శివాజీజయంతి సందర్భంగా ఈ ప్రకటన చేసింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని తెలిపారు. ఈ సినిమాకు మరింత ఆదరణ దక్కాలని ఆయన అన్నారు. అలాగే గోవాలోనూ ఈ సినిమాకు పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక మహారాష్ట్రలోనూ ఈ సినిమాకు పన్ను మినహాయింపు కలిగించాలని వస్తున్న విజ్ఞప్తుల గురించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సానుకూలంగా స్పందించారు. "ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితంపై గొప్ప సినిమా తీసినందుకు నేను సంతోషంగా ఉన్నాను. ఇంకా ఈ సినిమాను చూడలేదు. చరిత్రను ఎక్కడా వక్రీకరించకుండా దీన్ని తెరకెక్కించారు. ఈ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి వీలైనంత వరకు ప్రయత్నిస్తాం" అని అన్నారు. ఈ విషయంపై ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) దేవేంద్ర ఫడణవీస్‌కి ఇప్పటికే లేఖ రాసిన విషయం తెలిసిందే. "ఈ ధీరుడి కథ, ఆయన వారసత్వం, ధైర్యం రానున్న తరాలకు తెలియాలి. ఈ చిత్రం ఎక్కువమంది ప్రేక్షకులకు చేరుకోవాలి. ఈ ప్రభుత్వం 'ధర్మో రక్షతి రక్షితః'ను బలంగా విశ్వసిస్తుందని మేం అనుకుంటున్నాం. ఈ చిత్రం ఇదే భావాన్ని చూపుతోంది. దీనికి ఆదరణ పెరగాలి ఈ చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని లేఖలో పేర్కొంది.



## పింక్' విషయంలోనే.. నటి భావోద్వేగం

తెలంగాణ ముచ్చట్లు, సినిమా

చిత్రంలో ఫాలక్ అలీ పాత్రలో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు నటి కీర్తి కుల్హారి. ఆ సినిమా సమయంలో తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.'పింక్' చిత్రంలో ఫాలక్ అలీ పాత్రలో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు నటి కీర్తి కుల్హారి. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. షూటింగ్, ప్రమోషన్స్‌లో ఎవరూ తనకు సరైన విలువ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమితాబ్ బచ్చన్ తర్వాత ఆ సినిమాలో విశేషమైన ఆదరణను సొంతం చేసుకున్న వ్యక్తి తాప్సీ మాత్రమేనని అన్నారు. 'ఇండస్ట్రీలో చిన్నా, పెద్దా తేడాలు ఉండవని నటీనటులందరినీ ఒకేలా చూస్తారనే అభిప్రాయం నాది. గతంలో నేను వర్క్ చేసిన సినిమాల్లో అలాంటి బేధాభిప్రాయాలు ఎక్కడా చూడ లేదు. ఆ సినిమా సెట్స్‌లో అందరూ కలసికట్టుగా ఉండేవాళ్లం. 'పింక్' చిత్రం చిత్రీకరణ సమయంలో నేను ఎన్నో ఇబ్బం దులు ఎదుర్కొన్నా. ఇండస్ట్రీలో పరిస్థితులు ఎలా ఉంటాయో అప్పుడే అర్థం చేసుకున్నా. సినిమా ట్రైలర్ విడుదలైనప్పుడు చూసి ఎంతో బాధపడ్డా. ఎందుకంటే, అందులో మొత్తం సీన్స్ అమితాబ్, తాప్సీవే ఉన్నాయి. సినిమా కోసం నేను ఎంతలా వర్క్ చేశానో తెలుసని నాకు నేను సర్దిచెప్పుకున్నా. ఈ సినిమా రచయిత సూజిత్ నా బాధను అర్థం చేసుకున్నారు. "బాధపడకు.. సినిమా పూర్తి కానివ్వు. నీకు రావాల్సిన గుర్తింపు వస్తుందిలే" అని ధైర్యం చెప్పారు. ప్రమోషన్స్‌లోనూ ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొన్నా. అందరూ తాప్సీ పైనే ఫోకస్ పెట్టేవాళ్లు. ఇదంతా పీఆర్ స్ట్రాటజీ అని అర్థం చేసుకోవడానికి నాకు చాలా సమయం పట్టింది. ఎందుకంటే పీఆర్‌కు నేను దూరం. నా వర్క్‌పై నాకు పూర్తి నమ్మకం. ప్రేక్షకులని తప్పకుండా నన్ను ఆదరిస్తారని నమ్మా. ఆ సినిమా తర్వాత పీఆర్ గేమ్‌పై ఫోకస్ పెట్టా" అని కీర్తి అన్నారు. అనిరుద్ధారాయ్ తెరకెక్కించిన చిత్రం 'పింక్'. ఢిల్లీలో ముగ్గురమ్మాయిలకు ఎదురైన చేదు సంఘటన నేపథ్యంలో సాగే కథతో రూపొందిన ఈ సినిమా 2016లో విడుదలైంది. మంచి వసూళ్లతోపాటు పలు పురస్కారాలు దక్కించుకుంది. 'బెస్ట్ ఫిల్మ్ ఆన్ సోషల్ ఇష్యూస్' కేటగిరీలో జాతీయ పురస్కారం సొంతం చేసుకుంది.

## విమానంలో పెళ్లిరోజుని సెలబ్రేట్ చేసుకున్న మెగాస్టార్ చిరంజీవి.!





తెలంగాణ ముచ్చట్లు, సినిమా

అగ్ర నటుడు, పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి తన పెళ్లి రోజును అత్యంత సన్నిహితుల మధ్య విమానంలో జరుపుకున్నాడు. ఇక ఈ వేడుకలలో అక్కినేని నాగార్జునతో పాటు అతడి భార్య అమల తదితరులు ఉన్నారు. అయితే ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు చిరంజీవి.దుబాయ్ వెళ్లే క్రమంలో నా పెళ్లి రోజుని అత్యంత సన్నిహితుల మధ్య విమానంలో జరుపుకున్నాను. సురేఖ లాంటి జీవిత భాగస్వామి దొరకడం చాలా అదృష్టంగా భావిస్తున్నా. ఆమె నా బలం, నా యాంకర్ కూడా. ప్రపంచంలోని అద్భుతమైన నాకు తెలియని విషయాలను నావిగేట్ చేయడానికి నాకు ఎల్లప్పుడు సహాయం చేస్తుంది. తాను నా పక్కన ఉంటే ఒక కంఫర్ట్‌తో పాటు మోటివేషన్ కూడా వస్తుంది. సురేఖ నాకు ఎంత ముఖ్యమో తెలియజేయడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాను!. ఈ సందర్భంగా నా సోల్‌మేట్ సురేఖకు ధన్యవాదాలు. నీ పట్ల నాకున్న ప్రేమ, అభిమానాన్ని వ్యక్తపరచడానికి ఇలాంటి సందర్భాలు ఇంకా చాలా ఉన్నాయి. మరీ ముఖ్యంగా శుభాకాంక్షలు తెలిపిన మిత్రులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, నా శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు అంటూ చిరు రాసుకోచ్చాడు.

## నేను అలా చేశా.. మీరు చేసి చూడండి..

తెలంగాణ ముచ్చట్లు, సినిమా

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సమంత.. తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంటుంటారు. తాజాగా సామ్ పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. సోషల్ మీడియా రాజ్యమేలుతున్న రోజుల్లో, ప్రతి ఐదు నిమిషాల్లో రెండు నిమిషాలు ఫోన్‌కే కేటాయిస్తున్న సమయంలో మూడు రోజులపాటు ఫోన్‌కు దూరంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. ఆ అనుభవాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'మూడు రోజులు సైలెంట్‌గా ఉన్నాను. ఫోన్ లేదు. ఎవరితో కమ్యూనికేషన్ లేదు. నాతో నేను మాత్రమే ఉన్నాను. మనతో మనం ఒంటరిగా ఉండడం కష్టమైన విషయాల్లో ఒకటి. అతి భయంకరమైనది. కానీ, ఇలా మౌనంగా ఉండడాన్ని నేను ఇష్టపడతాను. మిలియన్‌సార్లు ఇలా ఒంటరిగా గడపమని చెప్పినా ఉంటాను. మీరు కూడా ఇలా ఉండటానికి ప్రయత్నించండి" అంటూ సూచనలిచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేసిన ఈ విషయం నెట్టింట వైరల్ అవుతోంది. జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న సమంత ప్రస్తుతం ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ పెట్టినట్లు ఈ పోస్ట్ ద్వారా తెలుస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor:BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telanganamuchatlu.in